thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

కేకేఆర్ వాటా విక్రయానికి రంగం సిద్ధం



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 215 | జగిత్యాల గురువారం 19 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

తెలంగాణలో ఏసీబీ పంజా



- వేర్వేరు ప్రాంతాల్లో సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్!
- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన సర్పంచ్
- రూ.1.50 లక్షల లంచం కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్
- మధ్యవర్తితో కలిపి ముగ్గురి అరెస్ట్
- లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచన

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రెండు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో ఓ సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన సర్పంచ్ రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా, పెద్దపల్లి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూ.1.50 లక్షల లంచం కేసులో ఏసీబీకి చిక్కారు. రెండు ఘటనల్లో మధ్యవర్తితో కలిపి ముగ్గురిని అధికారులు అరెస్ట్ చేశారు.



వివరాలు 2లో..



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకే ప్రాధాన్యం
- సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికి పైగా వారికే ఖర్చు
- ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ ముందంజ
- పార్లమెంటరీ కమిటీతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం తెలంగా ణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీతో భేటీ అయిన సీఎం, రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు.

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం, అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే నేతృత్వంలో జరిగిన ఈ సమా వేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన

మిగతా 2 లో



విద్యార్థుల కోసం 'తెలంగాణ దర్శిని'

2.92 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర పర్యటనల అవకాశం

కార్యక్రమం కోసం రూ.26.30 కోట్ల నిధులు మంజూరు

చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన

ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ.900 ఖర్చు

విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదతో పాటు ప్రకృతి అందాలపై ప్రత్యక్ష అవగా హన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యా పర్యటనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.26.30 కోట్ల నిధులు కేటాయించింది.

వివరాలు 2వ పేజీలో

నగరానికి నీటి తిప్పలు

- ఎల్ నినో ప్రభావంతో పడిపోయిన భూగర్భ జలాలు
- బోర్లు ఎండిపోవడంతో అపార్ట్‌మెంట్లలో నీటి నియంత్రణ
- ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు.. పెరిగిన అదనపు ఖర్చులు
- వేసవి ముందే ముంచుకొస్తున్న నీటి సంక్షోభం

2



నగరంలోని వెస్ట్ సిటీలో నీటి కొరత తీవ్రరూపం దాల్చుతోంది. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. ఐటీ సంస్థలు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నివాస సముదాయాలతో విస్తరించిన ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన నీటిని అందించడం కష్టంగా మారింది. గతంలో జలమండలి సరఫరా, బోర్ల నీటితో అవసరాలు తీరేవి. ప్రస్తుతం బోర్ల నుంచి నీరు అందకపోవడంతో జలమండలి సరఫరాపై ఆధారపడాల్సి వస్తోంది.



జంతుబలుల నిషేధానికి సుప్రీంకోర్టు నో!

మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్

పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యం కొట్టివేత

4

రాష్ట్ర ప్రగతికి జాతీయ గుర్తింపు

- ప్రత్యేక కేంద్ర ప్రోత్సాహకం సాధనలో తొలి రాష్ట్రంగా తెలంగాణ
- రైతులకు సులభతరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2





కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్ లష్కరే ఉగ్రవాది హతం!

- భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి
- మసీదులో దాక్కున్న ఉగ్రవాదిని గుర్తించిన బలగాలు

4

సాగర్ నీళ్లపై కుట్ర

- తెలంగాణకు తీరని అన్యాయం!
- నాగార్జునసాగర్ నుంచి 9 టీఎంసీల నీటి తరలింపునకు ఏపీ యత్నం
- ఏడాదిగా సారంగం తవ్వుతున్నా రేవంత్ ప్రభుత్వం మౌనం
- తాగునీటి పథకం ముసుగులో సాగునీటి తరలింపునకు కుట్ర

4





ప్రపంచ నేతలకు మోదీ కానుకలు

- ఫిలిప్పీన్స్ పర్యటనలో భారతీయ కళావైభవానికి పెద్దపీట
- ట్రంప్‌కు రాజస్థాన్ పిచ్వాయ్ చిత్రకళాఖండం

4

భూముల వేలం నిర్ణయాన్ని విరమించుకోండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

150 ఎకరాల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాల జోలికి రావద్దని హెచ్చరిక



4

టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు కన్నెర్ర!

- సాధారణ దుస్తుల్లో తనిఖీలు చేయడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- డీజీపీ, హోంశాఖ, పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు

3



బర్డ్‌ఫ్లూ నియంత్రణకు తొలి స్వదేశీ టీకా

నేడు దేశానికి అంకితం



4



విద్యార్థుల కోసం ‘తెలంగాణ దర్శిని’

2.92 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర పర్యటనల అవకాశం

కార్యక్రమం కోసం రూ.26.30 కోట్ల నిధులు మంజూరు

చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన

ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ.900 ఖర్చు

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదతో పాటు ప్రకృతి అందాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘తెలంగాణ దర్శిని’ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యా పర్యటనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 26.30 కోట్ల నిధులు కేటాయించింది. రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న సుమారు 2,92,286 మంది విద్యార్థులను ఈ యాత్రలకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్య, పర్యాటక, సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ, అటవీ శాఖలు సంయుక్తంగా కార్యక్రమాన్ని అమలు చేయనున్నాయి. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.900 ఖర్చు చేయనుండగా, ఇందులో విద్యాశాఖ నుంచి రూ.500, పర్యాటక శాఖ నుంచి రూ.400 సమకూరుతాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో పర్యటనల ప్రణాళిక, ప్రాంతాల ఎంపిక చేపడతారు. ఈ యాత్రల్లో గోల్కొండ కోట, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, భువనగిరి కోట, బుద్ధవనం, కొలనుపాక జైన మందిరం వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. శిల్పారామం, పోచంపల్లి, చేర్యాల, నిర్మల్ ప్రాంతాల్లోని కళలు, హస్తకళల గురించి కూడా విద్యార్థులకు వివరించనున్నారు. ప్రకృతి పర్యటనల్లో భాగంగా అనంతగిరి కొండలు, లక్నవరం, పాకాల సరస్సులు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లు, మేడారం, నాగార్జునసాగర్ ప్రాంతాలను చేర్చారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవగాహన ఏర్పడుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణపై భావితరాలకు ఆసక్తి పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ‘తెలంగాణ దర్శిని’ విద్యార్థులకు విజ్ఞానంతో పాటు కొత్త అనుభూతులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణలో ఏసీబీ పంజా

వేర్వేరు ప్రాంతాల్లో సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్!

రూ.2 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన సర్పంచ్

రూ.1.50 లక్షల లంచం కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): రాష్ట్రంలో లంచావతారాలు ఎత్తుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం జరిపిన మెరుపుదాడుల్లో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లా మోదుగడ్డ తండా సర్పంచ్ ధరావత్ వీరు.. స్థానికంగా గ్రానైట్ క్వారీ నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా ఉండేందుకు ఓ వ్యాపారిని భారీగా డిమాండ్ చేశారు. తొలుత రూ. 30 లక్షలు అడగ్గా, చివరకు రూ. 13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో మొదటి విడతగా రూ. 2 లక్షలు నగదును ఖమ్మంలోని ఫిర్యాదుదారుడి కార్యాలయంలో తీసుకుంటుండగా వరంగల్ ఏసీబీ అధికారులు రంగప్రవేశం చేసి దాడి చేసారు. సర్పంచ్‌ను అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు.

పెద్దపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్, మధ్యవర్తి అరెస్ట్:

మరో ఘటనలో పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ కరీంనగర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ధర్మారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో నిందితులకు అనుకూలంగా సాక్షుల విచారణ జరిగేలా చూసి, వారు నిర్దోషులుగా విడుదలయ్యేందుకు సహకరిస్తానని నమ్మబలికారు. దీనికోసం తొలుత రూ. 2 లక్షలు డిమాండ్ చేయగా, చివరకు రూ. 1.50 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ లంచం మొత్తాన్ని మధ్యవర్తి రెడ్డిరాజుల రాజయ్య ద్వారా స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, మధ్యవర్తి రాజయ్యను అరెస్ట్ చేసి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టారు.

ఏసీబీని సంప్రదించండి:

ప్రభుత్వ ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు సూచించారు. దీనికోసం టోల్‌ఫ్రీ నంబర్ ‘1064’ లేదా వాట్సాప్ నంబర్ ‘9440446106’ను సంప్రదించాలని కోరారు. ఫిర్యాదు చేసేవారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

మొదటి పేజీ తరువాయి

వివిధ కార్యక్రమాలు, తీసుకున్న కీలక నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి వారికి సవివరంగా వివరించారు. సమాజంలో వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక అలాగే రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా, మంత్రులుగా దళితులకు రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలోనూ అనేక ఉన్నత అవకాశాలు కల్పించినట్లు ప్రస్తావించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా తొలిసారిగా దళితుడికి అవకాశం కల్పించామని సీఎం గర్వంగా వెల్లడించారు. ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలలో కూడా ఎస్సీ, ఎస్టీలకే వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతీచోటా ఆ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని గుర్తుచేశారు.

ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీలో పెద్దపీట

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలోనూ ఎస్సీ, ఎస్టీలకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు సీఎం తెలిపారు. అలాగే సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి), ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణేనని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాగా, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం, ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్’ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు రవి, తాపీర్ గావ్, హరీశ్ చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, దగ్గుమల్ల ప్రసాద రావులతో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



నగరానికి నీటి తిప్పలు

- **ఎల్ నినో ప్రభావంతో పడిపోయిన భూగర్భ జలాలు**
- **బోర్లు ఎండిపోవడంతో అపార్ట్‌మెంట్లలో నీటి నియంత్రణ**
- **ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు..**
- **వేసవి ముందే ముంచుకొస్తున్న నీటి సంక్షోభం**

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): నగరంలోని వెస్ట్ సిటీలో నీటి కొరత తీవ్రరూపం దాల్చుతోంది. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. ఐటీ సంస్థలు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నివాస సముదాయాలతో విస్తరించిన ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన నీటిని అందించడం కష్టంగా మారింది. గతంలో జలమండలి సరఫరా, బోర్ల నీటితో అవసరాలు తీరేవి. ప్రస్తుతం బోర్ల నుంచి నీరు అందకపోవడంతో జలమండలి సరఫరాపై ఆధారపడాల్సి వస్తోంది. అయినప్పటికీ ఆ నీరు అపార్ట్‌మెంట్ల అవసరాలకు సరిపోక ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. నవంబర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిలో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకుని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. నీటి లభ్యత తగ్గడంతో పలు అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు సరఫరా సమయాన్ని కుదిస్తున్నాయి. గతంలో రోజంతా అవసరానికి తగినట్లుగా నీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉండగా, ప్రస్తుతం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఆ సమయంలోనే రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిల్వ చేసుకోవాలని సూచిస్తున్నారు. వంట, స్నానం, ఇతర గృహ అవసరాలకు నీటిని పొదుపుగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి వృథాను తగ్గించేందుకు మొక్కలకు నీరు పోయడాన్ని కూడా నిలిపివేశారు. ఒక వ్యక్తికి రోజుకు సగటున 130 లీటర్ల నీరు అవసరమని ప్రభుత్వ ప్రమాణాలు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం 30 నుంచి 40 లీటర్లతోనే సరిపెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని నివాసితులు చెబుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్న అపార్ట్‌మెంట్లకు సరఫరా సమస్యలు ఎదురవుతున్నాయి. అవసరానికి తగినన్ని ట్యాంకర్లు అందుబాటులో లేకపోవడం, ముందుగా బుక్ చేసుకున్నప్పటికీ నిర్ణీత సమయంలో చేరుకోకపోవడం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. ట్యాంకర్ల సరఫరాపై విధించిన నియంత్రణలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయని నివాసితులు పేర్కొంటున్నారు. గతంలో రెండు రోజులకు సుమారు 2,000 లీటర్ల నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 500 నుంచి 700 లీటర్లకే పరిమితమవుతోందని వాపోతున్నారు. దీంతో ఉదయం పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఉద్యోగాలకు బయలుదేరే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ నీటి ట్యాంకర్‌కు రూ. 1,200 నుంచి రూ. 1,500 వరకు చెల్లించాల్సి వస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.



నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల ఆదాయం పొందే కుటుంబాలు ప్రతి రెండు, మూడు రోజులకు ట్యాంకర్ కొనుగోలు చేయడం ఆర్థికంగా భారంగా మారింది. అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు సైతం నీటి సరఫరా కోసం రోజూ ఎన్ని ట్యాంకర్లు అవసరమవుతున్నాయి, నెలవారీ వ్యయం ఎంత అనే వివరాలను నమోదు చేస్తున్నాయి. పరిస్థితి కొనసాగితే నిర్వహణ ఛార్జీలను పెంచాల్సి వస్తుందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ నాటికి నీటి వనరులు మరింత తగ్గుతాయని భావించినప్పటికీ, నవంబర్‌లోనే తీవ్ర కొరత ఏర్పడిందని అపార్ట్‌మెంట్ వాసులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ వనరుల కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జలమండలి, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నీటి సరఫరాను పెంచడంతో పాటు భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, శుద్ధి చేసిన మురుగునీటిని పునర్వినియోగించే విధానాలను విస్తృతంగా అమలు చేయాలని వెస్ట్ సిటీ నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్ర ప్రగతికి జాతీయ గుర్తింపు

- **ప్రత్యేక కేంద్ర ప్రోత్సాహకం సాధనలో తొలి రాష్ట్రంగా తెలంగాణ**
- **రైతులకు సులభతరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): వ్యవసాయ రంగంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం (ఎస్ఏఎస్‌సీఐ) పథకం కింద రూ. 1,087.64 కోట్ల కేంద్ర ప్రోత్సాహక నిధులను సాధించి దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంలో సాధించిన పురోగతికి ఈ గుర్తింపు లభించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతుల నమోదు కార్యక్రమంలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి రైతు గుర్తింపు సంఖ్యలను నమోదు చేసినందుకు రూ. 422.64 కోట్ల ప్రత్యేక సహాయ నిధులను ఫిబ్రవరి 26న కేంద్రం విడుదల చేసిందని మంత్రి వివరించారు. అలాగే 2026-27లో కేంద్ర ప్రభుత్వ ఎరువుల యాప్ ద్వారా పంపిణీ వ్యవస్థను విజయవంతంగా అమలు చేసినందుకు రూ. 665 కోట్ల ప్రోత్సాహక నిధులు మూడు విడతల్లో విడుదలయ్యాయని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి మొత్తం రూ. 1,087.64 కోట్లు లభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీని సులభతరం చేసేందుకు మూడు దశల్లో నూతన విధానాన్ని అమలు చేశామని తుమ్మల తెలిపారు. తొలుత రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి, అనంతరం సగం జిల్లాలకు విస్తరించి, చివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినట్లు చెప్పారు. రైతు నమోదు గుర్తింపు సంఖ్య ద్వారా రైతుల వివరాలు అందుబాటులో ఉండటంతో ఎరువుల పంపిణీతోపాటు పంటల కొనుగోలు ప్రక్రియ కూడా సులభమవుతోందన్నారు. కనీస మద్దతు ధరకు పంటలను విక్రయించేందుకు ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందని వివరించారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన రైతు వంచర్ల అవినాష్ మాట్లాడుతూ రైతు గుర్తింపు సంఖ్యతో కొనుగోలు కేంద్రాల్లో పంటను సులభంగా విక్రయించగలుగుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లింగగూడెం గ్రామానికి చెందిన రైతు విజయం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా అవసరమైన ఎరువులను సులభంగా పొందినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతి వెనుక అధికారుల సమిష్టి కృషి ఉందని మంత్రి తుమ్మల అభినందించారు. కేవలం కేంద్ర నిధులు సాధించడమే కాకుండా వాటి ద్వారా రైతులకు వాస్తవ ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



నేడు సిద్ధిపేటకు సీఎం రేవంత్ రెడ్డి!

- **రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
- **ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం**
- **రూ.400 కోట్లతో రెండు సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన**
- **కోటి ఇందిరమ్మ చీరల పంపిణీకి సిద్ధిపేట నుంచే శ్రీకారం**
- **కొమురవెల్లిలో భారీ బహిరంగ సభ.. ఏర్పాట్లు పూర్తి**

కొమురవెల్లి, నవంబర్ 19 (చురకలు): సీఎం రేవంత్ రెడ్డి గురువారం సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. కొమురవెల్లిలో నిర్వహించే బహిరంగ సభలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడంతోపాటు రూ. 544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం రూ. 451.13 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు రూ. 92.98 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేయనున్నారు. దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 15.44 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ. 13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. చిన్నకోడూరు మండలంలో రూ. 7.50 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ. 7.80 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతోపాటు జనగామ నియోజకవర్గంలో రూ. 6.89 కోట్లతో మూడు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే సిద్ధిపేట జిల్లాలో రూ. 54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించనున్నారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ. 14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ. 12 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. మరోవైపు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధిపేట వేదికగా ప్రారంభించనున్నారు. మహిళలకు పుట్టింటి సారెగా కోటి చీరలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిలుకపచ్చ రంగులో రెండు ఆకర్షణీయమైన నమూనాలతో రూపొందించిన 9 మీటర్లు, 6.30 మీటర్ల చీరలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే చీరలు జిల్లాలకు చేరుకున్నాయి. మహిళల గౌరవం, ఆత్మగౌరవం, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.



సాగర్ నీళ్లపై కుట్ర

తెలంగాణకు తీరని అన్యాయం!

- నాగార్జునసాగర్ నుంచి 9 టీఎంసీల నీటి తరలింపునకు ఏపీ యత్నం
- ఏడాదిగా సారంగం తవ్వుతున్నా రేవంత్ ప్రభుత్వం మౌనం
- తాగునీటి పథకం ముసుగులో సాగునీటి తరలింపునకు కుట్ర
- చంద్రబాబు, మోదీలను ప్రసన్నం చేసుకునేందుకే రాష్ట్ర ప్రయోజనాల తాకట్టు
- కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడాల్సిందే
- అవసరమైతే న్యాయపోరాటం.. ప్రజా ఉద్యమం తప్పదు: కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): నాగార్జునసాగర్ నుంచి భారీ సారంగం నిర్మించి తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాగునీటి పథకం పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా డెడ్ స్టోరేజ్ నుంచి తొమ్మిది టీఎంసీల నీటిని తరలించేందుకు కుట్ర జరుగుతోందని, ఏడాదిగా నిర్మాణ పనులు కొనసాగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం పాటిస్తోందని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు సహకరిస్తోందని ఆరోపించారు. నాగార్జునసాగర్ వద్ద విజయపురి సౌత్ ప్రాంతంలో 510 అడుగుల దిగువన సారంగం నిర్మించి, 1,650 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా తొమ్మిది టీఎంసీల నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిగా ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నా ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి నిఘా, నీటిపారుదల శాఖల అధికారులు సమాచారం ఇవ్వలేదా అని నిలదీశారు. చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునేందుకే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. గతంలో పోతిరెడ్డిపాడు ద్వారా శ్రీశైలం జలాలను తరలించినట్లే ఇప్పుడు నాగార్జునసాగర్ నుంచి నీటిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తాగునీటి అవసరాల కోసం మిగిలిన 40 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ బోర్డుకు లేఖ రాశారా అని ప్రశ్నించారు. హైదరాబాద్, పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలకు ముప్పు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాగునీటి సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్ నియామకంపైనా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించిన వ్యక్తికి కీలక బాధ్యతలు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. ఈఎన్సీ రమేశ్‌బాబు పదవీకాలాన్ని పొడిగించడంపైనా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన వ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలు అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నీటి కొరతపై ప్రభుత్వంలోనే పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. అక్టోబర్‌లో సుమారు 2.50 లక్షల వాటర్ ట్యాంకర్లు బుక్ అయ్యాయని, రోజుకు దాదాపు ఎనిమిది వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒకవైపు నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు నీటి సమస్య లేదని మంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు చారిత్రకంగా అన్యాయం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో తెలంగాణకు 28 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 72 శాతం వాటా ఉందని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణా నది సుమారు 300 కిలోమీటర్లు ప్రవహిస్తున్నా సాగునీటి విషయంలో అన్యాయం కొనసాగిందన్నారు. కృష్ణా నది సుమారు 300 కిలోమీటర్లు ప్రవహిస్తున్నా సాగునీటి విషయంలో అన్యాయం కొనసాగిందన్నారు. కేసీఆర్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. నాగార్జునసాగర్ నుంచి ప్రతిపాదిత నీటి తరలింపును అడ్డుకునేందుకు ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీని ఆశ్రయించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, రైతులు, ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతోపాటు మహబూబ్‌నగర్‌లోనూ ఉద్యమ కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

భూముల వేలం నిర్ణయాన్ని విరమించుకోండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- 150 ఎకరాల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాల జోలికి రావద్దని హెచ్చరిక
- మిగిలిన 400 ఎకరాలను ప్రజా ప్రయోజనా లకు, లంగ్ స్పేస్‌గా అభివృద్ధి చేయాలి
- ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101 పరిధిలో గల 550 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. మియాపూర్‌లోని ఎం.ఏ.నగర్, ప్రశాంత్ నగర్, స్టాలిన్ నగర్, దీప్తిశ్రీ నగర్ కాలనీలలో ఆయన బుధవారం పర్యటించి, తమ నివాసాలను కోల్పోతామన్న భయాందోళనలో ఉన్న స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక ఏళ్లుగా న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న ఈ 550 ఎకరాల భూమిపై ఇటీవల సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను వేలం వేయాలని చూడటం దారుణమన్నారు. ఇందులో దాదాపు 150 ఎకరాల భూమిలో 1983 నుండే అధికారిక రిజిస్ట్రేషన్లు, హెచ్ఎండీఏ అప్రూవ్ డ్ లేఅవుట్లు, బ్యాంకు రుణాల ద్వారా మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లు ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే జీవో నంబర్ 58, 59, 60ల కింద పేదలు క్రమబద్ధీకరించుకున్న 68 గజాల స్థలాలు, బస్తీలలో దాదాపు 10 నుండి 15 వేల కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్నాయన్నారు. 30 ఏళ్లకు పైగా వారి స్వాధీనంలో ఉన్న ఈ 150 ఎకరాల భూమి, ఇళ్లు కచ్చితంగా ఆయా కుటుంబాలకే చెందాలని, ప్రభుత్వం వాటి జోలికి వెళ్లకూడదని ఆయన డిమాండ్ చేశారు. మిగిలిన 400 ఎకరాల భూమిని 2,500 నుండి 5,000 గజాల ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలంలో అమ్మాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రామచందర్ రావు మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్మి ప్రభుత్వాన్ని నడపాలనుకోవడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని విమర్శించారు. పెరుగుతున్న కాలుష్యం, పట్టణీకరణ నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి 'లంగ్ స్పేసెస్' (స్వచ్ఛమైన గాలినిచ్చే ఖాళీ ప్రదేశాలు) ఎంతో అవసరమని అన్నారు. అందువల్ల ఈ 400 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టకుండా పార్కులు, ప్లే గ్రౌండ్స్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్పిటల్స్ నిర్మాణం వంటి ప్రజా ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని స్థానికుల పక్షాన బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తే బీజేపీ ఊరుకోదని హెచ్చరించిన ఆయన ప్రజల హక్కులు, నివాసాలను కాపాడేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రభుత్వ భూముల వేలాన్ని నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, స్వయంగా తానే మొదటి సంతకం చేసి ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి కుమార్ యాదవ్, మహిపాల్, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణకు విస్తరించండి

- ముంబయి పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం
- ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారితో పెట్టుబడుల ప్రక్రియకు సహకారం



ముంబయి, నవంబరు 18 : 'మీ ప్రధాన కార్యాలయం ముంబయిలోనే ఉంచుకోండి.. తయారీ, వ్యాపార విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను తెలంగాణలో చేపట్టండి' అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముంబయి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోవాలని కోరారు. ముంబయిలోని వర్లీలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం బుధవారం నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' రోడ్‌షోలో మంత్రి ప్రసంగించారు. సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల తెలంగాణ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. రెండు ప్రాంతాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయంటూ తెలంగాణ, ముంబయి మధ్య తరతరాలుగా కొనసాగుతున్న అనుబంధాన్ని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు! ! చేశారు. తెలంగాణకు చెందిన కార్మికులు, చేతివృత్తులవారు, వ్యాపారవేత్తలు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముంబయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు. సాంకేతిక రంగం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఔషధ పరిశ్రమలు, వస్త్రాలు, దుస్తుల తయారీ, మీడియా, వినోద రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యమున్న మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను వినియోగించుకుని వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవాలని ముంబయి పారిశ్రామికవేత్తలకు సూచించారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనాలని ఆహ్వానించారు. పెట్టుబడులకు వేగంగా అనుమతులు మంజూరు చేసే టీజీ-ఐపాస్ విధానాన్ని వివరించారు. ముంబయి నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. పెట్టుబడులపై తొలి చర్చల నుంచి సంస్థ కార్యకలాపాలు ప్రారంభించి ఆదాయం ఆర్జించే దశ వరకు ఆ అధికారి పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులకు అన్ని దశల్లో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముంబయిలోని పారిశ్రామిక, వ్యాపార సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. ముంబయిలోని ఆర్థిక, కార్పొరేట్ రంగ బలాన్ని తెలంగాణలోని తయారీ సామర్థ్యాలు, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అవకాశాలతో అనుసంధానించడం ద్వారా పరస్పర ప్రయోజనాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) వైస్ ఛైర్మన్, ఎండీ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తెలంగాణ ప్రతినిధి బృందంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు ముంబయికి చెందిన పలు కంపెనీల ప్రతినిధులతో విడివిడిగా సమావేశమయ్యారు. పెట్టుబడి ప్రతిపాదనలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, పరస్పర భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు.



టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు కన్నెర్ర!

- సాధారణ దుస్తుల్లో తనిఖీలు చేయడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- డీజీపీ, హోంశాఖ, పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు
- పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశం.. డిసెంబర్‌కు విచారణ వాయిదా

హైదరాబాద్, నవంబర్ 19 (చురకలు): హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సోదాలు, తనిఖీల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా సోదాలు నిర్వహిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు జారీ చేసింది. ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదే శించింది. జస్టిస్ మాధవీదేవి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. బోరబండకు చెందిన బి.బాలరాజ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పోలీసు దుస్తులు ధరించకుండా సాధారణ దుస్తుల్లో వచ్చి సోదాలు నిర్వహిస్తున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే తనిఖీలు చేపట్టి వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టడం భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023 నిబంధనలకు విరుద్ధమని వాదించారు. సంబంధిత వ్యక్తులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించకుండా, పారదర్శకత పాటించకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సోదాల వారెంట్లు జారీ చేసే అధికారం న్యాయ మేజిస్ట్రేట్‌లకే ఉంటుందని, ఏసీపీ స్థాయి అధికారులు వాటిని జారీ చేయడం చట్టబద్ధం కాదని వాదించారు. ఈ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై ప్రతివాదులు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది. అయితే టాస్క్‌ఫోర్స్ సోదాలు చట్టవిరుద్ధమని హైకోర్టు తుది నిర్ధారణ చేయలేదు. ఆరోపణలపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కేటీఆర్ వ్యాఖ్యలు కృతజ్ఞతకు నిదర్శనం!

- తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని విమర్శిస్తారా?
- నాగార్జునసాగర్ నిర్మాణంలో నెహ్రూ కృషిని తక్కువ చేస్తారా?
- పదేళ్లలో కృష్ణా పరీవాహక ప్రాంతానికి బీఆర్ఎస్ చేసిందేమిటి?
- కేటీఆర్ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక నిర్ణయం తీసుకున్న సోనియా గాంధీని కేటీఆర్ విమర్శించడం కృతజ్ఞతకు నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సోనియా గాంధీ సంకల్పం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని, ఈ విషయాన్ని గతంలో కేసీఆర్ కూడా శాసనసభలో అంగీకరించారని గుర్తుచేశారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ చేసిన ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే కేటీఆర్ కుటుంబానికి రాజకీయ పదవులు దక్కాయని, ఆ విషయాన్ని విస్మరించి సోనియా గాంధీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కృషిని కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటం విడ్డూరమని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి సుమారు 21 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న నాగార్జునసాగర్ ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు తగిన ఫలితాలు సాధించలేకపోయిందని ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సాగునీటి రంగంలో చేసిన వ్యయంలో 75 శాతం గోదావరి పరీవాహక ప్రాంతానికే కేటాయించి, కృష్ణా పరీవాహక ప్రాంతానికి కేవలం 25 శాతం వెచ్చించిందని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణా జలాల్లో 811 టీఎంసీలకు గాను ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించే నిష్పత్తికి బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం పరీవాహక ప్రాంతం, జనాభా, సాగునీటి అవసరాల ఆధారంగా తెలంగాణకు 555 టీఎంసీలు రావాలని ట్రైబ్యునల్ ముందు వాదిస్తోందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణ వినియోగం 1,993 టీఎంసీలకే పరిమితమైందని ఉత్తమ్ తెలిపారు. ప్రస్తుత జల సంవత్సరంలో అక్టోబర్ 30 నాటికి ఏపీ 98.16 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 122.74 టీఎంసీలు వినియోగించుకుందని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును 2014లో ప్రకటించినప్పటికీ సమగ్ర ప్రాజెక్టు నివేదికను 2022లోనే సమర్పించారని, అనుమతుల సాధనలో జాప్యం కారణంగా ప్రాజెక్టు వ్యయం పెరిగిందని విమర్శించారు. నాగార్జునసాగర్ నుంచి సుమారు 1.8 టీఎంసీల నీటిని తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన తాగునీటి పథకంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు తెలిపిందని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలను పంపినట్లు వెల్లడించారు. తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే ఏ పథకాన్నైనా అడ్డుకుంటామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు.

సంపాదకీయం



నెమ్మదిగా కదిలే తుఫానులు

పెనువిపత్తుకు సంకేతాలా?

వేగం తక్కువైనా విధ్వంసం ఎక్కువయ్యే ప్రమాదం

ప్రకృతి విపత్తుల తీవ్రతను అంచనా వేయడంలో మనం ఇప్పటికీ కొన్ని అపోహల మధ్యనే ఉన్నాం. తుఫాను ఎంత వేగంగా కదులుతోంది? గాలులు ఎంత బలంగా వీస్తున్నాయి? అనే అంశాల ఆధారంగానే దాని ప్రమాదాన్ని అంచనా వేస్తుంటాం. కానీ నెమ్మదిగా కదిలే తుఫానులు కూడా అత్యంత ప్రమాదకరంగా మారవచ్చని వాతావరణ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. బంగాళాఖాతంలో తుఫానుల ముప్పు నేపథ్యంలో ఈ అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. తుఫాను కదలిక మందగించడం ఒక్కటే దాని విధ్వంసక శక్తిని నిర్ణయించకపోయినా, ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు ప్రభావం చూపడం వల్ల భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే తుఫాను వేగం కంటే దాని ప్రభావం ఎంతసేపు కొనసాగుతుందనే అంశాన్ని కూడా ప్రభుత్వాలు, ప్రజలు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా తుఫాను వేగంగా ముందుకు కదిలితే ప్రభావిత ప్రాంతాన్ని తక్కువ సమయంలో దాటిపోతుంది. కానీ నెమ్మదిగా కదిలే తుఫాను ఒకే ప్రాంతంపై గంటల తరబడి, కొన్నిసార్లు రోజులపాటు ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతాయి. నదుల్లో నీటిమట్టాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. వ్యవసాయ భూములు నీటమునిగి పంటలు దెబ్బతింటాయి. రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, సమాచార సంబంధాలు స్తంభించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లో సముద్రపు అలల ఉద్ధృతి, భారీ వర్షాలు ఒకేసారి సంభవిస్తే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది. తుఫానుల కదలికలు, వర్షపాతం మధ్య సంబంధంపై శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించాయి. 2021లో 'జర్నల్ ఆఫ్ హైడ్రోమెటియరాలజీ'లో ప్రచురితమైన అధ్యయనంలో 2010 నుంచి 2019 మధ్య తీరాన్ని దాటిన 280 ఉష్ణమండల తుఫానులను పరిశీలించారు. తుఫానుల కదలిక వేగం, వరదల తీవ్రత మధ్య సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. నెమ్మదిగా కదిలే తుఫానులు ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు వర్షాలు కురిపించడం వల్ల మొత్తం వర్షపాతం పెరిగి వరదల ప్రమాదం అధికమవుతుందని అధ్యయనం సూచించింది. అయితే వేగంగా కదిలే తుఫానుల్లో వర్షపాతం తక్కువగా ఉంటుందని భావించడం కూడా సరికాదు. 2022లో 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమైన మరో పరిశోధనలో 2001 నుంచి 2020 మధ్య ఉపగ్రహాల ద్వారా సేకరించిన వర్షపాత సమాచారాన్ని విశ్లేషించారు. వేగంగా కదిలే ఉష్ణమండల తుఫానుల్లో సగటు వర్షపాతం రేటు నెమ్మదిగా కదిలే తుఫానులతో పోలిస్తే 24 శాతం ఎక్కువగా ఉన్నట్లు ఆ అధ్యయనం గుర్తించింది. దీన్నిబట్టి తుఫాను కదలిక వేగం, వర్షం కురిసే తీవ్రత, మొత్తం వర్షపాతం మూడు వేర్వేరు అంశాలని అర్థమవుతోంది. తక్కువ సమయంలో అత్యంత భారీ వర్షం కురవడం ఒక రకమైన ప్రమాదమైతే, ఎక్కువసేపు వర్షాలు కొనసాగడం మరో రకమైన ప్రమాదం. రెండింటినీ సమానంగా పరిగణించాల్సిందే. ఆంధ్రప్రదేశ్ వంటి సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన రాష్ట్రాలకు తుఫానులు కొత్తేమీ కాదు. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల ప్రభావం తరచూ కనిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో వ్యవసాయం, మత్స్యకార వృత్తి, తీరప్రాంత ఆర్థిక కార్యకలాపాలు వాతావరణ పరిస్థితులపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. తుఫాను హెచ్చరిక వెలువడినప్పుడల్లా మత్స్యకారుల జీవనోపాధి నిలిచిపోవడం, చేతికొచ్చిన పంటలు దెబ్బతినడం, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రకృతి విపత్తు ముగిసిన తర్వాత కూడా బాధిత కుటుంబాలు సాధారణ స్థితికి చేరుకోవడానికి నెలల తరబడి సమయం పడుతోంది. మరోవైపు వాతావరణ మార్పులు తుఫానుల స్వభావంపై చూపుతున్న ప్రభావాన్ని విస్మరించలేం. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తుఫానులకు అవసరమైన శక్తి లభించే అవకాశాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఎల్‌నినో వంటి ప్రపంచ వాతావరణ పరిణామాలు కూడా తుఫానుల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను ప్రభావితం చేయగలవు. అయితే ఒక నిర్దిష్ట తుఫానుకు ఎల్‌నినోనే కారణమని చెప్పాలంటే ప్రత్యేకమైన శాస్త్రీయ విశ్లేషణ అవసరం. ప్రతి తుఫానును వాతావరణ మార్పులకు నేరుగా ఆపాదించడం కంటే దీర్ఘకాలిక పరిశోధనల ఆధారంగా ప్రమాదాలను అంచనా వేయడం ముఖ్యం. ఇక్కడ ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు తుఫాను వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం మాత్రమే కాదు. తుఫాను రాకముందే ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించడం. వాతావరణ శాఖ హెచ్చరికలను గ్రామస్థాయికి చేరవేయడం, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తుఫాను ఆశ్రయ కేంద్రాలను సిద్ధంగా ఉంచడం అత్యవసరం. చెరువులు, కాలువలు, మురుగునీటి పారుదల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం కూడా వరద నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తీరప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణ, పటిష్ఠమైన మౌలిక సదుపాయాల నిర్మాణం, శాస్త్రీయ ప్రణాళికల అమలు దీర్ఘకాలిక రక్షణకు అవసరం. ప్రకృతి విపత్తులను పూర్తిగా అడ్డుకోవడం మనిషి చేతుల్లో లేకపోవచ్చు. కానీ వాటి వల్ల సంభవించే నష్టాలను తగ్గించడం మాత్రం సాధ్యమే. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకపోతే ముందస్తు హెచ్చరికల ప్రయోజనం ప్రజలకు అందదు. తుఫాను కదలికలపై నిరంతర నిఘా, శాస్త్రీయ అంచనాల ఆధారంగా నిర్ణయాలు, ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరం.



ప్రపంచ నేతలకు మోదీ అపురూప కానుకలు

- ఫిలిప్పీన్స్ పర్యటనలో భారతీయ కళావైభవానికి పెద్దపీట
- ట్రంప్‌కు రాజస్థాన్ పిచ్వాయ్ చిత్రకళాఖండం
- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడికి కశ్మీరీ పట్టు తివాచీ
- జపాన్ ప్రధానికి బనారసీ పట్టు శాలువా
- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన బహుమతులు


మనీలా, నవంబర్ 18 (చురకలు): భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేలా ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నేతలకు అపురూప బహుమతులు అందజేశారు. రెండు ప్రాంతీయ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొనేందుకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా చేరుకున్న సందర్భంగా పలువురు దేశాధినేతలకు భారతీయ హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబించే కళాఖండాలను కానుకలుగా ఇచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ చిత్రకళ, శిల్పకళ, వస్త్ర కళాఖండాలను ఎంపిక చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజస్థాన్‌లో ప్రసిద్ధి చెందిన గోల్డెన్ పిచ్వాయ్ చిత్రకళాఖండాన్ని మోదీ బహూకరించారు. సంప్రదాయ వస్త్ర చిత్రకళకు ప్రతీకగా నిలిచే ఈ కళాఖండంలో బంగారు వర్ణాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌కు కశ్మీరీ పట్టు తివాచీని అందజేశారు. చేతితో నేసే ఈ తివాచీలు సున్నితమైన అల్లికలు, ఆకర్షణీయమైన నమూనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు చోళుల కాలం నాటి శిల్ప సంప్రదాయాన్ని ప్రతిబింబించే కాంస్య కళాఖండాన్ని బహూకరించారు. తొమ్మిదో శతాబ్దం నుంచి పదమూడో శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో విలసిల్లిన చోళ శిల్పకళకు ఈ బహుమతి ప్రతీకగా నిలిచింది. కంబోడియా ప్రధాని హున్ మానెట్‌కు సంప్రదాయ ధోక్రా కళాత్మక పడవను అందజేశారు. మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు జింక్, రాగి మిశ్రమంతో రూపొందించే బిద్రీవేర్ లోహ కళాఖండాన్ని కానుకగా ఇచ్చారు. జపాన్ ప్రధాని సనాయే తకైచికి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ప్రసిద్ధ బనారసీ పట్టు శాలువాను అందజేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కు రాజస్థాన్‌లోని జైపూర్ నీలిరంగు మట్టిపాత్ర కళాఖండాన్ని బహూకరించారు. ఈ బహుమతుల ద్వారా రాజస్థాన్, కశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సంప్రదాయ కళలకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు లభించింది. దౌత్య సంబంధాలతోపాటు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నంగా మోదీ అందించిన కానుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్..

లష్కరే ఉగ్రవాది హతం!

భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి

మసీదులో దాక్కున్న ఉగ్రవాదిని గుర్తించిన బలగాలు



శ్రీనగర్, నవంబర్ 18 (చురకలు): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత చర్యల్లో భాగంగా భద్రతా బలగాలు మరో ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. కుల్గాం జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన లతీఫ్ భట్ హతమయ్యాడు. ఓ మసీదులో దాక్కున్న అతడిని గుర్తించిన భద్రతా దళాలు ముందుగా లొంగిపోవాలని సూచించాయి. అయితే అందుకు నిరాకరించిన లతీఫ్ కాల్పులకు దిగడంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో అతడు మృతి చెందినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లా అఖ్రాన్‌లోని సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై జరిగిన దాడిలో లతీఫ్ భట్‌కు కీలక పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ దాడిలో ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం ఉమర్ నిసార్ అనే ఉగ్రవాది ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తాజాగా లతీఫ్ భట్ ఆచూకీ లభించడంతో కుల్గాంలో ప్రత్యేక గాలింపు చర్యలు నిర్వహించారు. మసీదులో దాక్కున్న లతీఫ్‌తో పోలీసులు, ఉన్నతాధికారులు వీడియో కాల్ ద్వారా మాట్లాడి లొంగిపోవాలని కోరినట్లు సమాచారం. 'నీకు ఇంకా జీవితం ఉంది.. నువ్వు చాలా చిన్నవాడివి' అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే లొంగిపోయేందుకు నిరాకరించిన అతడు 'నేను అల్లాహ్‌ను కలవాలనుకుంటున్నాను' అని సమాధానమిచ్చినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిగాయని వెల్లడించాయి. లతీఫ్ భట్ హతమైన అనంతరం కూడా ఆ ప్రాంతంలో భద్రతా దళాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీరు పారిపోవచ్చు.. కానీ తప్పించుకోలేరు' అంటూ పోస్టు చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు

తొలి స్వదేశీ టీకా

నేడు దేశానికి అంకితం



భోపాల్, నవంబర్ 18 (చురకలు): దేశంలోని పౌల్ట్రీ పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్‌ఫ్లూ నియంత్రణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తొలి స్వదేశీ టీకాను అభివృద్ధి చేసినట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. నవంబర్ 20న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో జరిగే కార్యక్రమంలో దీనిని జాతికి అంకితం చేయనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తరచూ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందడంతో పెద్ద సంఖ్యలో కోళ్లు, ఇతర పక్షులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో భోపాల్‌లోని పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు కొంతకాలంగా ప్రయోగాలు నిర్వహించి స్వదేశీ టీకాను అభివృద్ధి చేశారు. ఈ టీకా అందుబాటులోకి వస్తే బర్డ్‌ఫ్లూ నియంత్రణ చర్యలకు మరింత బలం చేకూరే అవకాశముందని భావిస్తున్నారు. అయితే టీకా వాణిజ్య ఉత్పత్తి, మార్కెట్‌లో విడుదల, రైతులకు అందుబాటులోకి వచ్చే తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. టీకా వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు వెల్లడైన తర్వాతే పౌల్ట్రీ పరిశ్రమకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్పష్టత రానుంది.

నావికాదళానికి మరింత రక్షణ కవచం!

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు భారత్ కీలక ఒప్పందం

ఇజ్రాయెల్ సంస్థతో రూ.1,976 కోట్ల భారీ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబర్ 18 (చురకలు): భారత నావికాదళ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధనౌకలపై అమర్చిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ఆధునికీకరించేందుకు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థతో రూ.1,976.40 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఇరుపక్షాల అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత నావికాదళ యుద్ధనౌకల్లోని బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సమగ్రంగా ఆధునికీకరించనున్నారు. కాలం చెల్లిన సాంకేతిక పరికరాల స్థానంలో అధునాతన విడిభాగాలను అమర్చడంతోపాటు వ్యవస్థల పనితీరును మెరుగుపరచనున్నారు. తద్వారా శత్రు దేశాల క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర గగనతల ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం మరింత పెరుగుతుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. సముద్ర జలాల్లో విధులు నిర్వహించే యుద్ధనౌకలకు బరాక్ క్షిపణి వ్యవస్థ కీలక రక్షణ కవచంగా పనిచేస్తోంది. ఆకస్మిక గగనతల దాడులను గుర్తించి అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. తాజా ఆధునికీకరణతో క్షిపణి రక్షణ వ్యవస్థల విశ్వసనీయత, నిర్వహణ సామర్థ్యం పెరగనున్నాయి. సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్-ఇజ్రాయెల్ రక్షణ సహకారంలో ఈ ఒప్పందం మరో కీలక ముందడుగుగా నిలవనుంది.





జంతుబలుల నిషేధానికి సుప్రీంకోర్టు నో!

మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్

పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యం కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబర్ 18 (చురకలు): మతపరమైన వేడుకలు, ఆలయాల్లో జంతుబలులను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. న్యాయవాది శృతి బిష్ట్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహాదేవన్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని పలు ప్రాంతాల్లో మతం పేరుతో జంతుబలులు కొనసాగుతున్నాయని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. జంతు హింస నిరోధక చట్టం--1960లో మతపరమైన ఆచారాలకు కల్పించిన మినహాయింపులను సవరించాలని కోరారు. మతపరమైన కార్యక్రమాల పేరిట జంతువులను చంపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు విరుద్ధమని వాదించారు. జంతుబలులను నిషేధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. పిటిషన్ కొట్టివేతకు సంబంధించిన పూర్తి కారణాలు ఉత్తర్వుల్లో వెల్లడికావాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి బహుజన మిత్రుల బాసట

బొమ్మ వెంకటవ్వ కుటుంబానికి పరామర్శ
50 కిలోల బియ్యం అందజేసి ఆర్థికంగా చేయూత



దుబ్బాక ప్రతినిధి (అక్బర్ పేట భూంపల్లి), నవంబర్ 18, :

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే మానవత్వానికి నిదర్శనమని చాటుతూ బహుజన మిత్రులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట–భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన బొమ్మ వెంకటవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, బహుజన మిత్రుల బృందం ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, కుటుంబ అవసరాల నిమిత్తం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మిత్రులతో పాటు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

దుబ్బాక యువతరమా.. చలో సిద్దిపేట!

- సీఎం సభకు యువత భారీగా తరలిరావాలి.. సభను విజయవంతం చేయాలి
- యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బురాని శ్రీకాంత్ పిలుపు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :



దుబ్బాక నియోజకవర్గ యువత సత్తా చాటే సమయం ఆసన్నమైందని, గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడంలో దుబ్బాక నియోజకవర్గ యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. యువతలో ఉన్న ఉత్సాహం, ఐక్యత, చైతన్యాన్ని చాటుతూ పెద్ద సంఖ్యలో సిద్దిపేటకు చేరుకుని సభకు మరింత జోష్ తీసుకురావాలని ఆకాంక్షించారు. దుబ్బాక నియోజకవర్గం నుంచి యువత స్వచ్ఛందంగా తరలివచ్చి ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల కలప పట్టివేత

దమ్మపేట, నవంబర్ 18, :



అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల మిక్స్‌డ్ ఫైర్‌వుడ్ కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. తనిఖీల్లో భాగంగా కలపను స్వాధీనం చేసుకోగా, దాని విలువ రూ.24,375 గా అంచనా వేశారు. కలపతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, బాధ్యులపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు. అటవీ సంపద అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ దమ్మపేట రేంజ్ అధికారులు హెచ్చరించారు.

వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 18, :



కూకట్‌పల్లిలోని ఎన్ఆర్‌సీ గార్డెన్స్‌లో ఎక్కల్ దేవ్ కుటుంబ సభ్యుల వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మిత్రులు యాదగిరి యాదవ్ గారి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వివాహ వేడుకకు హాజరయ్యారు. నూతన వధూవరులను అభినందించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

అభివృద్ధి పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడ్డ హరీష్ రావు

- కమిషన్లు వచ్చే పనులే చేసి మిగతా అభివృద్ధి పనులను గాలికొదిలేశారు
- పదేళ్లు అధికారంలో ఉండి నిధులు తేలేని వారు.. నేడు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరం..
- సిద్దిపేట సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి
- డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

సిద్దిపేట అభివృద్ధి పేరుతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారని, కమిషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చి, మిగతా అభివృద్ధి పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ ఆరోపించారు. గురువారం సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు మంత్రిగా కీలక శాఖలు నిర్వహించిన హరీష్ రావు సిద్దిపేట అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఇక అభివృద్ధి చేయడానికి పనులే లేవని చెప్పిన హరీష్ రావు, ఇప్పుడు నిధులు ఇవ్వడం లేదంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పనులకు ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదో, అసంపూర్తిగా ఉన్న పనులను ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లేదా సంబంధిత మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని హరీష్ రావు ఎప్పుడైనా కోరారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అనుమతులు, నిధుల మంజూరు లేకుండానే కొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులు ప్రారంభించి, ఇప్పుడు పాటికి నిధులు రావడం లేదని ఆరోపించడం సరికాదన్నారు. కోమటి చెరువు అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, శిల్పారామం నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులను సమానంగా చేపట్టకుండా, తమకు లాభదాయకమైన పనులకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మీసం నాగరాజు యాదవ్ స్పష్టం చేశారు. ఈ నెల 19న సిద్దిపేటలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు జిల్లా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసం రాజు, ఒగ్గు కిసాన్, దొమ్మాట శ్రీనివాస్, తాళ్లపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

- సీఎం సిద్దిపేట సభను విజయవంతం చేయండి
- పార్టీ శ్రేణులకు మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు పిలుపు

గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), నవంబర్ 18, :

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో కుకునూరుపల్లిలో కొద్దిసేపు ఆగిన ఆయన, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డితో కలిసి కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ ఇండ్ల కనకయ్య కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొంతం కర్ణాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యం, ఉపసర్పంచ్ దొంతి సత్యం, ఈగ తిరుపతి, బోడపట్ల రమేష్, నాగులపల్లి ప్రభాకర్, గొడుగు బాబు, ఇండ్ల శ్రీకాంత్, యాట చంద్రం, అంజయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిద్దిపేట ప్రజలకు హరీష్ రావు క్షమాపణ చెప్పాలి

- 59 జీవో పేరుతో దళితుల భూములు లాక్కొని ఒకే ప్రాజెక్టుకు రెండు రకాల పరిహారాలు ఇచ్చారు
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేని గ్రామాల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు బిఆర్ఎస్ కు లేదు
- మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

సిద్దిపేట నియోజకవర్గంలో పదేళ్ల పాటు మంత్రిగా, సుమారు 30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజలకు మాజీ మంత్రి హరీష్ రావు క్షమాపణ చెప్పాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. 59 జీవో పేరుతో దళితుల భూములను హరీష్ రావు, ఆయన అనుచరులు లాక్కున్నారని ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని హరీష్ రావు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తోందని తెలిపారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించి కాలువల నిర్మాణం పూర్తి చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అంతేకాకుండా అంతగిరి ప్రాజెక్టు విషయంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని అంతగిరి ప్రాంత రైతులకు ఒక రకమైన పరిహారం, సిద్దిపేట నియోజకవర్గంలోని అల్లీపూర్ రెవెన్యూ పరిధి గ్రామాల రైతులకు మరో రకమైన పరిహారం ఇచ్చి చిన్నకోడూరు మండల రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని, వడ్డీతో సహా రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయలేకపోయారని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారంతో ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు సుమారు రూ.26 వేల కోట్ల రుణమాఫీ చేపట్టారని పేర్కొన్నారు. చిన్నకోడూరు మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలు ఉండగా, కేవలం ఏడు, ఎనిమిది గ్రామాల్లో మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి మిగతా గ్రామాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేని గ్రామాల్లో హరీష్ రావుకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని స్పష్టం చేస్తూ, ఈ సవాల్‌ను స్వీకరించే ధైర్యం హరీష్ రావుకు, ఆయన అనుచరులకు ఉందా అని ప్రశ్నించారు. గతంలో చేసిన తప్పులకు బాధ్యత వహిస్తూ సిద్దిపేట ప్రజలకు హరీష్ రావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మీసం మహేందర్ యాదవ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పరశురాం, సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, ఉడుత జయంత్, అంతగిరి చంద్రశేఖర్, కాల్వ జగన్, గొట్టిపర్తి చందు తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

- నూతన గృహ యజమాని కృష్ణ యాదవ్ కుటుంబానికి శుభాకాంక్షలు

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 18, :



కూకట్‌పల్లి నియోజకవర్గం ఖైతలాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, మిత్రులు కృష్ణ యాదవ్ ఆహ్వానం మేరకు బుధవారం నిర్వహించిన వారి నూతన గృహప్రవేశ వేడుకకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ముఖ్యంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కృష్ణ యాదవ్ గారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, నూతన గృహంలో అడుగుపెట్టిన కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యుల జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు నిండాలని, ఆ భగవంతుని ఆశీస్సులతో కుటుంబం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ గృహప్రవేశ వేడుక భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

సిద్దిపేట సమగ్ర అభివృద్ధికి 12 డిమాండ్లు

- పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిద్దిపేట జిల్లా ఫోరం బహిరంగ లేఖ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

సిద్దిపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిద్దిపేట జిల్లా ఫోరం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు జిల్లా అభివృద్ధికి సంబంధించిన 12 ప్రధాన డిమాండ్లతో బుధవారం ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా విద్యా, వైద్య, పారిశ్రామిక, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ, కేవలం హామీలకే పరిమితం కాకుండా కార్యాచరణతో కూడిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఫోరం ప్రధానంగా చేసిన 12 డిమాండ్లు ఇవే..

"సిద్దిపేట కేంద్రంగా అన్ని ఉన్నత విద్యా కోర్సులు అందుబాటులో ఉండేలా పూర్తిస్థాయి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాన్సర్ ఆసుపత్రిని నెలకొల్పాలి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన వెయ్యి పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలి. రాష్ట్రంలో అత్యంత పురాతనమైన సిద్దిపేట మున్సిపాలిటీని విస్తరించి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలి. వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి ఎనిమిది వరుసల రహదారిగా విస్తరించాలి. పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డ్రై పోర్టును ఏర్పాటు చేయాలి. సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ కు వెంటనే పాలకవర్గాన్ని నియమించి, సమగ్ర అభివృద్ధి కోసం రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలి. జిల్లా కేంద్రం చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డు పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలి. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేసి చర్లపల్లి టెర్మిన ల్‌తో అనుసంధానం



చేయాలి. జిల్లా ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ యేలా జిల్లా కోర్టు భవన సముదాయాన్ని వెంటనే నిర్మించాలి. జిల్లా పరిషత్‌కు పూర్తిస్థాయి భవనాన్ని నిర్మించాలి. బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం బీసీ భవనాన్ని ఏర్పాటు చేయాలి. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలి". ఈ సందర్భంగా జిల్లా ఫోరం అధ్యక్షుడు వంగ రాంచంద్రారెడ్డి, సమన్వయకర్త తుమ్మనపల్లి శ్రీనివాసు మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధి అనేది ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, జిల్లా ప్రజల భవిష్యత్తు, యువత ఉపాధి, విద్యార్థుల ఉన్నత విద్య, పేదల వైద్య అవసరాలతో ముడిపడి ఉన్న కీలక అంశమని అన్నారు. ప్రభుత్వం ఈ 12 అంశాలను సానుకూలంగా పరిశీలించి, నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసు, గుండ్ల జనార్దన్, అమ్మన చంద్రారెడ్డి, వీరారెడ్డి, బోయ రాములు, చొప్పదండి సుధాకర్, ముజఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం కేసీఆర్ బయటకు రావాలి

- సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాధిత గ్రామాల అభివృద్ధికి నిధులు సాధించాలి
- నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్‌తో కలిసి పోరాడేందుకు సిద్ధం
- ముంపు గ్రామాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలి
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల మధ్యకు రావాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ముంపు బాధితుల అభివృద్ధి కోసం కేసీఆర్‌తో కలిసి పనిచేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాకు వస్తున్న నేపథ్యంలో మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను కేసీఆర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన నిధులు సాధించేందుకు చొరవ చూపాలన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను రాజకీయాలకు వాడుకోవడం మానుకుని, వారి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులను పరామర్శించేందుకు కేటీఆర్ కూడా వస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పునరావాస గ్రామాల ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించి తరలించినప్పటికీ, నేటికీ వారు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా కేసీఆర్‌పై నమ్మకంతో ఓటు వేసిన ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించారని, కానీ ఆయన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష నేతగా, కేబినెట్ హోదా కలిగిన నాయకుడిగా ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తెలుసుకోవాలని కోరారు.నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, ఇప్పటికైనా ముంపు గ్రామాల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు పరిహారంగా భావించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాలకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు.



యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా జూపల్లి రామారావు

- కర్ణాటక రాష్ట్ర పంచాయతీ టాస్క్‌ఫోర్స్ విభాగంలో కీలక బాధ్యతలు
- అచ్యుతాపురం యువకుడికి జాతీయ స్థాయిలో గుర్తింపు.. హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

అశ్వారావుపేట ప్రతినిధి, నవంబర్ 18, :

యూత్ కాంగ్రెస్‌లో అశ్వారావుపేట మండలం, అచ్యుతాపురం గ్రామానికి చెందిన జూపల్లి కోదండ వెంకట్ రామారావుకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు లభించాయి. యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా (ప్రీ నేషనల్ ఆఫీస్ బేరర్) ఆయన నియమితులయ్యారు. అంతేకాకుండా కర్ణాటక రాష్ట్ర పంచాయతీ టాస్క్‌ఫోర్స్ విభాగంలో ఆయనకు బాధ్యతలు కేటాయించారు. స్థానికంగా కాంగ్రెస్ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన రామారావుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంపై పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బెంగళూరులో యూత్ కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జి మనీష్ శర్మ, జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్ నాయకత్వంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరానికి రామారావు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరం అనంతరం ఆయన పనితీరు, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించి జాతీయ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ కర్ణాటక రాష్ట్రంలో బాధ్యతలు అప్పగించారు. రామారావు గతంలో కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో కోఆర్డినేటర్‌గా, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అంచెలంచెలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చిన ఆయనకు జాతీయ స్థాయిలో అవకాశం దక్కడం విశేషం. తన నియామకానికి సహకరించిన తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు సయ్యద్ ఖలీద్ అహ్మద్, కేఆర్ భవ్య, రోషిణి, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డికి రామారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామారావుకు జాతీయ స్థాయిలో బాధ్యతలు లభించడం పై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.



రూ.5 లక్షల జీవిత బీమా పథకం పోస్టర్ ఆవిష్కరణ

- తోట దేవి ప్రసన్నతో కలిసి ఆవిష్కరించిన కక్కిరాల రమేష్

దమ్మపేట, నవంబర్ 18, :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను నవంబర్ 19, న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించనున్న సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నతో కలిసి దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కక్కిరాల రమేష్ బుధవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పథకం నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించి, ఆపద సమయంలో ఆర్థిక భరోసా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు దమ్మపేట మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి గడపకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు కక్కిరాల రమేష్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని, అర్హులైన ప్రతి కుటుంబం పథకంలో నమోదు చేసుకునేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర నాయకులు, అన్నవరపు నాగేంద్రరావు తదితరులు ఉన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా 240 కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు

దుబ్బాక నియోజకవర్గానికి రెండు నూతన సహకార సంఘాలు

అక్బర్‌పేట-భూంపల్లి, రాయపోల్ మండలాల్లో పీఏసీఎస్‌ల ఏర్పాటు

చెరుకు శ్రీనివాస్ రెడ్డికి పాతూరి వెంకటస్వామి గౌడ్ కృతజ్ఞతలు



దుబ్బాక ప్రతినిధి (అక్బర్ పేట భూంపల్లి), నవంబర్ 18, :

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 240 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్) ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రులకు, తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ బుధవారం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి, రాయపోల్ మండలాల్లో నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని కృషి చేసిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వ్యవసాయ రంగానికి అవసరమైన సేవలు సులభంగా అందించేందుకు నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు దోహదపడుతుందని, ఈ నిర్ణయం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందని పాతూరి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు.

సీఎం సిద్దిపేట సభను విజయవంతం చేయండి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి

టీఎస్ఎస్ఓ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దుర్గా ప్రసాద్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

ఈనెల 19న సిద్దిపేటలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చెట్కూరి దుర్గాప్రసాద్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని దుర్గాప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు.

ముబారక్ పూర్ లో అర్హులకు చేయూత పింఛన్ •మంజూరు పత్రాల పంపిణీ

- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం – సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి



సదాశివపేట, నవంబర్, 18,:

అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి అన్నారు. సదాశివపేట మండలం ముబారక్‌పూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను బుధవారం ఆయన స్థానిక సర్పంచ్ నవీన్ కుమార్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా గడీల రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బలహీన వర్గాల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు

- బహుమతులు అందజేసిన దొడ్ల వెంకటేష్ గౌడ్
- పేద విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం అందిస్తున్న పాస్టర్ గోపి సేవలు అభినందనీయం

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్18,:

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న బేతల్ గాస్పల్ చర్చ్‌లో బ్రదర్ గోపి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు బహుమతులు అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై తన చేతుల మీదుగా చిన్నారులకు బహుమతులు అందజేశారు.బుధవారం ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. బేతల్ గాస్పల్ చర్చ్ పాస్టర్ గోపి గతం నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు నిర్వహించడంతో పాటు భోజన సదుపాయం కల్పించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న పాస్టర్ గోపి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత మంది సేవా భావంతో ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పాస్టర్ గోపికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, ఖలీమ్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ అభివృద్ధికి సేవకుడిలా పనిచేస్తా



- రాజకీయాలకు అతీతంగా జగద్గిరిగుట్టను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, :

జగద్గిరిగుట్ట డివిజన్ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వాంబే గృహాల కాలనీలో స్థానికులతో కలిసి ఆయన పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు వీధుల్లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కొలుకుల జగన్ సంబంధిత అధికారులతో మాట్లాడి, రోడ్లు మరియు భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, కాలనీల అభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, జగద్గిరిగుట్ట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

"వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి"

అదనపు కలెక్టర్ ప్రసునాంబ

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 18, :

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం బ్యాంకింగ్ రంగ సెప్టెంబర్ త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ ప్రసునాంబ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని బ్యాంకులకు వ్యవసాయ రంగానికి, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించి ఇప్పటి వరకు సాధించిన పురోగతిపై సమీక్షతో పాటు, గ్రౌండింగ్ లో ఉన్న ఇబ్బందుల గురించి చర్చించి నిర్ణయించుకున్న రుణ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్, ఆర్బీఐ ఎల్డీఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర, యూబీఐ, ఎస్బీఐ రీజనల్, డిప్యూటీ రీజనల్ హెడ్, సంబంధిత శాఖల, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు కల్పించాలి

- పేద రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి
- మిద్దెపాక సిద్దులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :

అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు కల్పించి పేద రైతులకు న్యాయం చేయాలని భూ రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక సిద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని పేదలకు సాగు చేసుకునేందుకు భూములు కేటాయించడంతో పాటు, వ్యవసాయానికి అవసరమైన బావులు, కాడెద్దులు అందించి ఆదుకున్న ఘనత



మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి దక్కుతుందని సిద్దులు కొనియాడారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు కల్పించి పేద రైతులకు మేలు చేయాలని కోరారు.చేవెళ్లలో నిర్వహించిన దళిత డిక్లరేషన్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీని అమలు చేయాలని కోరారు. అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి హక్కులు కల్పించడం ద్వారా సుమారు 15 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉందని, పేద రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భూ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వేముగంటి వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి శ్రీనివాస్, మద్దూరు మండల అధ్యక్షుడు కొమ్ము భాస్కర్, చిగురుమామిడి మండల అధ్యక్షుడు జిల్లెల్ల రమేష్, మండల కార్యదర్శి మంజ మహేందర్, చిట్టెల సతీష్, జిల్లెల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట అభివృద్ధికి 37 అజెండాలకు ఆమోదం

- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు
- కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటుకు కౌన్సిల్ నిర్ణయం

సదాశివపేట, నవంబర్ , 18,:

సదాశివపేట పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన మొత్తం 37 అజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల తదితర అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. వివిధ వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలు, వాటి ప్రాధాన్యత, అంచనా వ్యయాలపై అధికారులు సభ్యులకు వివరించారు. అనంతరం 37 అజెండా అంశాలకు ఆమోదం లభించింది.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళిక

రాబోయే వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నీటి ఎద్దడి తలెత్తే అవకాశాల నేపథ్యంలో తాగునీటి సమస్యపై కౌన్సిల్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించడం, ప్రస్తుతం ఉన్న బోర్‌వెల్స్ పనితీరును సమీక్షించడం, అవసరమైన ప్రాంతాల్లో అదనపు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడంపై చర్చించారు.ప్రతి వార్డులో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించాలని కౌన్సిల్ సభ్యులు సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు

ప్రజా అవసరాలకే అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే



పనులకు ప్రాధాన్యతనిస్తూ, ఆమోదం పొందిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూపట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యుల సహకారంతో అన్ని వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో ప్రజలకు సరిపడా తాగునీరు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు, సంబంధిత మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొంపల్లిలో ఘనంగా చేయూత పింఛన్ల పంపిణీ..

- లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 6,700 పింఛన్లు మంజూరు..
- కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : కొంపల్లిలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 6,700 చేయూత పింఛన్లు, రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, డీసీసీ అధ్యక్షులు పజ్రేష్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటాలకే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత.. అర్హులకు అందని చేయూత పెన్షన్లు!

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : ప్రచార ఆర్భాటాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించడంలో కనిపించడం లేదని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ లబ్ధిదారుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని, అర్హులైన లబ్ధిదారులందరికీ పెన్షన్లు మంజూరు చేయకుండా కొందరికే పంపిణీ చేయడం నిరాశ కలిగించిందని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని కేవీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా, అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ పెన్షన్లు మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు.



ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రూ.4 వేల పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి ప్రజలను నమ్మించి, ఇప్పుడు కొందరికే పెన్షన్లు పంపిణీ చేస్తూ చేతులు దులుపుకుంటోందని మండిపడ్డారు. రూ.4 వేల పెన్షన్ హామీ సంగతి పక్కన పెడితే, కనీసం అర్హులైన వృద్ధులకు కూడా పెన్షన్లు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గతంలో 58 సంవత్సరాల వయస్సులో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మూడేళ్లు గడిచి 61 సంవత్సరాలు వచ్చినా ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం, చివరి నిమిషంలో కొందరికి మాత్రమే పెన్షన్లు మంజూరు చేసి మిగిలిన అర్హులకు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ జయంతి పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్భాటాలు కనిపిస్తున్నాయే తప్ప, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అవినీతి పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వస్తే కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తప్పదని అన్నారు.

అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం..

ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలను పక్కనపెట్టి నిజమైన అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతుందని కేపీ వివేకానంద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఉప కమిషనర్లు లావణ్య, సాబేర్ అలీ, వెంకట మణి కరణ్, శంకర్ సింగ్, రాములు, లక్ష్మీ ప్రసన్నతో పాటు వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు బాలల భవిష్యత్తుకు అడ్డుకావద్దు

- ఆశ్రిత జిల్లా కోఆర్డినేటర్ గణేష్
- బాల్య వివాహాల నిషేధ చట్టంపై విద్యార్థులకు అవగాహన

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 18, :

బాల్య వివాహాలు బాలల బంగారు భవిష్యత్తుకు అడ్డుకావద్దని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్య ద్వారా జీవితంలో స్థిరపడాలని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గణేష్ సూచించారు. బాల్యాన్ని కాపాడుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధ చట్టం–2006పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గణేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా, వాటిలో పాల్గొన్నా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని వివరించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని సూచించారు. సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో అనవసర అంశాల పట్ల ఆకర్షితులై విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా, బాల కార్మికులు కనిపించినా, బాలబాలికలు శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల



ప్రభావంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఆశ్రిత వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆశ్రిత ప్రతినిధి వీణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గొప్ప కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ముందుకు సాగాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయంగా జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని తెలిపారు. టీనేజ్ వయసులో అనవసర ఆకర్షణలకు లోనై భవిష్యత్తును దెబ్బతీసుకోవద్దని సూచించారు. అనంతరం 'బాల్య వివాహ రహిత భారతదేశం' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రిత ప్రతినిధి రమేష్, స్టూడెంట్ కౌన్సిలర్ చంద్రయ్య, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు భాగ్యలక్ష్మికి పుప్పాల భాస్కర్ పరామర్శ

- కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : పుప్పాల భాస్కర్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు భాగ్యలక్ష్మి ప్రమాదవశాత్తు చేతికి గాయపడిన విషయం తెలుసుకున్న సూరారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ బుధవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా నాయకులు, పార్టీ కుటుంబ సభ్యులు అండగా నిలుస్తారని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం పార్టీ నాయకుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, గండయ్య, కిరణ్ సాగర్, దశరథ్, అన్వర్, ప్రశాంత్, అఖిల్, రవికుమార్, సుమన్, లావణ్య, ధనలక్ష్మి తదితర బస్తీ నాయకులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం

- కార్పొరేట్ ఆసుపత్రుల సేవలు అభినందనీయం : హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : పేదలు, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో కార్పొరేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, పేదలకు ఇవి వరమని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ అన్నారు. బుధవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో, సూరారం నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కపా సుబ్బారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, దంత వైద్యం, మధుమేహం, రక్తపోటు తదితర విభాగాలకు సంబంధించి 200 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలకు వారి నివాస ప్రాంతాల్లోనే వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో కార్పొరేట్ ఆసుపత్రులు



ముందుకు వచ్చి ఉచిత వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ, శేఖర్, నాయకులు కట్టె శ్రీకాంత్ యాదవ్, ఆశ్రిత్ ముదిరాజ్, సందీప్ బల్లెం, నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదశ మహా పడిపూజ



- మాధవరం సందీప్ రావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్సీలు, ప్రముఖులు

కూకట్‌పల్లి ప్రతినిధి, బుధవారం, నవంబర్ 18, :

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ కాలనీలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అష్టాదశ మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనయుడు మాధవరం సందీప్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. స్వాముల శరణుఘోషతో వివేకానంద నగర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, జూపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు, అయ్యప్ప స్వాములు, కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అష్టాదశ మహా పడిపూజ కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది.

కుత్బుల్లాపూర్‌లో మరో 6,685 మందికి నూతన పింఛన్లు మంజూరు

- నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం –
- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో 6,685 నూతన పింఛన్లు మంజూరు చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా బుధవారం కొంపల్లిలోని కేవీఆర్ గార్డెన్స్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ



పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నూతనంగా 6,685 మందికి పింఛన్లు మంజూరు చేయడం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

డివిజన్ల వారీగా పింఛన్ల వివరాలు:

నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు మంజూరైన నూతన పింఛన్ల వివరాలను అధికారులు వెల్లడించారు. చింతల్‌లో 1,657, దుండిగల్‌లో 793, గాజులరామారంలో 1,214, కొంపల్లిలో 1,465, నిజాంపేట మున్సిపల్ పరిధిలో 520, కుత్బుల్లాపూర్‌లో 1,036 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. మొత్తం 6,685 మంది లబ్ధిదారులకు డిసెంబర్ నెల నుంచి పింఛన్ సొమ్ము వారి ఖాతాల్లో జమ కానుంది. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ (ఐఏఎస్), డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, డీసీసీ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్
- నియోజకవర్గంలో 4,092 కొత్త పెన్షన్ల పత్రాల పంపిణీ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 18, :



పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 4,092 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట, బోయిన్‌పల్లి సర్కిళ్ల పరిధిలో మంజూరైన కొత్త పెన్షన్లకు సంబంధించి బుధవారం మూసాపేటలోని ఆంజనేయ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సున్నం చెరువు, నల్ల చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులను కోట్లాది రూపాయలతో చేపడుతున్నామని చెప్పారు. గత మూడేళ్లలో సుమారు 20 వేల మందికి కొత్త రేషన్ కార్డులు అందించామని, రూ.180 కోట్లతో మూసాపేట వద్ద బ్రిడ్జి నిర్మాణంతో పాటు జేఎన్‌టీయూ వద్ద స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నామని వీవరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని బండి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో సంక్షేమ సంబరాలు

- 1,112 మందికి చేయూత పింఛన్లు
- ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించడమే చేయూత లక్ష్యం
- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 18, :

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, ప్రతి నిరుపేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే చేయూత పింఛన్ల ప్రధాన లక్ష్యమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో గల గోదాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పండుగ వాతావరణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని 1,112 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అరెకపూడి గాంధీ మాట్లాడుతూ చేయూత అంటే కేవలం పింఛన్ మాత్రమే కాదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు జీవితంపై భరోసా కల్పించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక భద్రత రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంక్షేమం అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియ అని పేర్కొంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతుల రాజేందర్ పటేల్, యాసిన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో బాధిత కుటుంబాలకు ఊరట

- రూ.60 వేల చెక్కును మొయిజ్, షేక్ జకీర్‌లకు అందజేసిన శేరి సతీష్ రెడ్డి



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబరు 18, :
అల్లాపూర్ డివిజన్‌కు చెందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. ఈ సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.60,వేల చెక్కును కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అల్లాపూర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొయిజ్, షేక్ జకీర్ కి అందజేశారు.ఈ చెక్కును అల్లాపూర్ డివిజన్‌కు చెందిన సంబంధిత లబ్ధిదారులకు అందజేసే బాధ్యతను వారికి అప్పగించారు. అర్హులైన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోటి దీపోత్సవానికి మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

- మహదేవపురం డివిజన్ లో కోటి దీపోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : మహదేవపురం డివిజన్ పరిధిలోని మహదేవపురంలో నిర్వహించనున్న కోటి దీపోత్సవ వేడుకలకు హాజరుకావాలని హైందవ ధర్మ జాగరణ అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌లను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవ వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యజ్ఞసాగర్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరిన ఇతర పార్టీల నాయకులు

- మిరుదొడ్డిలో 14వ వార్డు మెంబర్ పిట్ల ప్రశాంత్ తో పాటు 50 మంది హస్తం గూటికి
- కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించిన దుబ్బాక నియోజకవర్గ ఇన్ చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి




దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 18, :
దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలంలో కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తల చేరికలు బుధవారం చోటుచేసుకున్నాయి. మండల కేంద్ర పరిధిలోని 14వ వార్డు సభ్యుడు పిట్ల ప్రశాంత్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ లకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో సిద్దిపేటలో ట్రాఫిక్ ఆంక్షలు

- 19న మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల మళ్లింపు
- బస్సులకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు.. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, :
ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పట్టణంలో పర్యటించి బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభకు వచ్చే ప్రజలకు, సాధారణ వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ బుధవారం స్థానిక మీడియాకు తెలిపారు.



సభకు వచ్చే బస్సులకు మార్గాలు

★ వరంగల్, హనుమకొండ, హుస్నాబాద్, చేర్యాల, హైదరాబాద్, గజ్వేల్, యాదగిరిగుట్ట ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు రంగధాంపల్లి చౌరస్తా, వేములవాడ కమాన్, ఎల్లం ధాబా మీదుగా నాగదేవత ఆలయం వద్దకు చేరుకోవాలి.

★ మెదక్, రామాయంపేట, దుబ్బాక ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు బూరుగుపల్లి, చిన్నగుండవెల్లి, బండచర్లపల్లి, గాడిచర్లపల్లి మీదుగా నాగదేవత ఆలయానికి చేరుకోవాలి.

★ కరీంనగర్ నుంచి వచ్చే బస్సులు రంగీలా ధాబా, వేములవాడ కమాన్, ఎల్లమ్మ టెంపుల్, ఎల్లం ధాబా మీదుగా రావాలి.

★ రాజన్న సిరిసిల్ల, వేములవాడ నుంచి వచ్చే బస్సులు ఎల్లం ధాబా మీదుగా నాగదేవత ఆలయానికి చేరుకోవాలి.

బస్సుల్లో వచ్చే ప్రయాణికులను నాగదేవత ఆలయం వద్ద దించిన అనంతరం పోలీసు శాఖ కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే బస్సులను నిలపాలి.

సాధారణ వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలు

హైదరాబాద్-కరీంనగర్ మార్గం.. ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణించే వాహనాలు పట్టణంలోకి రాకుండా రింగ్ రోడ్డు మీదుగా వెళ్లాలి. పట్టణంలోకి రావాలనుకునేవారు రంగధాంపల్లి చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, న్యూ బస్టాండ్ మీదుగా చేరుకోవాలి.

మెదక్, రామాయంపేట మార్గం.. సిద్దిపేట రూరల్ సర్కిల్, ఎన్సాన్‌పల్లి చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, న్యూ బస్టాండ్ మీదుగా పట్టణంలోకి రావాలి.

ముస్తాబాద్ మార్గం.. రావురుకుల చౌరస్తా, పుల్లూరు, మల్యాల, రామంచ, ఇమాంబాద్ గ్రామాల మీదుగా ఎల్లం ధాబా, ఎల్లమ్మ టెంపుల్, వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా ద్వారా పట్టణంలోకి చేరుకోవాలి.

సిరిసిల్ల, వేములవాడ మార్గం.. వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా మీదుగా పట్టణంలోకి రావాలి.

వాహనదారులు పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించు కోవాలని, నిర్ణయించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

హెచ్ఎంటీ పునరుద్ధరణకు కృషి చేస్తా.. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా!

- ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దృష్టికి హెచ్ఎంటీ సమస్యలు తీసుకెళ్తా: రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని హెచ్ఎంటీ మిషన్ టూల్స్ సంస్థను తిరిగి పూర్వవైభవానికి తీసుకురావడంతో పాటు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హామీ ఇచ్చారు. సంస్థ సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి, భారీ పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బుధవారం ఆల్ ఇండియా బీసీ ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్యతో కలిసి ఆయన జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని హెచ్ఎంటీ మిషన్ టూల్స్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటీ యూనియన్ నాయకులు, ఓబీసీ సంఘం ప్రతినిధులు సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం యూనిట్ జీటీఎం శ్రీకుమార్‌తో సమావేశమై సంస్థ ప్రస్తుత పరిస్థితి, పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే హెచ్ఎంటీ చైర్మన్ రమేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సంస్థ పరిస్థితి, సమస్యలు, పునరుద్ధరణకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్ఎంటీ సంస్థ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకుంటానని, కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యల కోసం సంబంధిత మంత్రులతో మాట్లాడతానని పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు కృషి

హెచ్ఎంటీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిలు ఇంకా అందలేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్. కృష్ణయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీశైలం, సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ జీ, శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు ఏఎన్ చారి, జాయింట్ సెక్రటరీ లచ్చయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ రతన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, కోశాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఓబీసీ అసోసియేషన్ నాయకులు మాదన్నతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు ఆత్మీయ స్వాగతం

- నూతన గృహానికి విచ్చేసి ఆతిథ్యం స్వీకరించిన మంత్రి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకకు కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ప్రత్యేకంగా ఆయన నివాసానికి విచ్చేసి వారితో కొంత సమయం ఆత్మీయంగా గడపడంతో పాటు మధ్యాహ్న భోజనం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని కిషోర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి చూపిన ఆప్యాయత, అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సైతం వారి నివాసానికి విచ్చేసి నూతన



గృహాన్ని సందర్శించి వారిని అభినందించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న 'చలో సిద్దిపేట' కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకుల పిలుపు మేరకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా భాగస్వాములై చలో సిద్దిపేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సాధు యాదవ్, గంట శివారెడ్డి, పృథ్వీ, మహేష్, కృష్ణ యాదవ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మా నూతన నివాసానికి విచ్చేసి తమ విలువైన సమయాన్ని కేటాయించడమే కాకుండా, ఆత్మీయతను, అభిమానాన్ని పంచుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఇతర నాయకులు, కార్యకర్తలందరికీ ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధుల మధ్య రాజకీయ వివక్ష

సత్తుపల్లి నవంబర్ 18, : గ్రామ ప్రజలచే ఎన్నికైన సర్పంచులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో కనీస ప్రాధాన్యత, గౌరవం కల్పించడం లేదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని విమర్శించారు. పెన్షన్ల పంపిణీలో ప్రోటోకాల్ పాటించకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించడం, అభివృద్ధి పనుల్లో సర్పంచుల భాగస్వామ్యం లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు వేంసూరు మండలం మర్లపాడులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సర్పంచులు, పార్టీ నాయకులు ప్రభుత్వ, అధికారుల తీరుపై మండిపడ్డారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలపై ముందస్తు సమాచారం లబ్ధిదారులకు అందించిన అధికారులు, గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులకు మాత్రం సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. సాయంత్రం 4.30 గంటలకు కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, కేవలం అరగంట ముందు వాట్సాప్ ద్వారా సమాచారం పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవోను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులు సెలవులో ఉన్నారని చెప్పినట్లు వెల్లడించారు. ముందస్తు సమాచారం అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యమని విమర్శించారు. మండలంలో సగానికి పైగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు ఉన్నప్పటికీ అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో సర్పంచులను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులందరికీ సమాన గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ల మంజూరులో గ్రామాల వారీగా సంఖ్యలు మాత్రమే తెలియజేస్తూ, లబ్ధిదారుల పేర్లతో కూడిన పూర్తి జాబితాలను సర్పంచులకు అందించడం లేదని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు ముందుగానే వివరాలు అందుతున్నాయని, ప్రతిపక్ష సర్పంచులకు మాత్రం సమాచారం ఇవ్వడం లేదని విమర్శించారు. తమ గ్రామంలో ఎవరికి పెన్షన్ మంజూరైందో తెలియని పరిస్థితిలో ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎల్-3 జాబితాలో ఉన్నవారికి, ఆర్థిక స్థోమత ఉన్నవారికి ఇళ్లు కేటాయిస్తున్నారని, ఇళ్లు కూలిపోయి నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న పేదలు మాత్రం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లబ్ధిదారుల జాబితాలను సర్పంచులకు తెలియజేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రజలకు అందుబాటులో ఉండటం లేదంటూ చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వారంలో మూడు రోజులపాటు నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ చేస్తున్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు ఎదురు చూస్తుంటే వారికి భరోసా కల్పించాల్సిన నాయకులు బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేకు ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడం కంటే అర్హులైన పేదలకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సండ్ర వెంకటవీరయ్యపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం కల్పించాలని, సర్పంచులను విస్మరించే విధానాలకు అధికారులు స్వస్తి పలకాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు యర్రా రమేష్, మందపాటి వెంకటరెడ్డి, కాటే జమలారావు, పోతురాజు చక్రధరరావు, సాదు లక్ష్మి , దొడ్డ శోభనాచలం, ఉపసర్పంచులు గొర్ల సత్యనారాయణరెడ్డి, మోరంపూడి శ్రీధర్‌బాబు, దొడ్డ చెన్నకేశవరెడ్డి, పాలా గంగాధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, మారోజు సురేష్, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, మందపాటి మహేశ్వర్‌రెడ్డి, మిరియాల ప్రసాద్, గాయం రాంబాబు, మట్టా రవి, జుంజునూరి వరప్రసాద్, బోయ యేసు తదితరులు పాల్గొన్నారు.



పరిపాలనా దక్షురాలు ఇందిరా ప్రియదర్శిని

నేడు ఇందిరా గాంధీ జయంతి

ఇందిరాగాంధీ ఈ పేరు వినగానే ... తెగింపు , ధైర్యం, ఆత్మ విశ్వాసం, సాధికారిక, పట్టుదల అన్నీ గుర్తుకు వస్తాయి. ఒక మహిళ అయి ఉండి ప్రఖ్యాతి గాంచిన మహానేతలతో పోటీ పడి భారత దేశాన్ని ఏకచక్రాధి పత్యంగా పాలించ గలిగిన రాజనీతిజ్ఞులు. ఎన్ని సంక్షోభాలు ఎదురైనా, బెణుకు అనేది లేకుండా , ధైర్యసాహసాలతో ప్రధాని హోదాలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోని పరిపాలనలో చెరగని ముద్ర వేసుకున్న సాటిలేని మేటి. ఇందిరా ప్రియదర్శిని గాంధీ (నవంబర్ 19, 1917 -- అక్టోబర్ 31, 1984) భారత దేశపు మొట్ట మొదటి, ఏకైక మహిళా ప్రధాన మంత్రి. ఆమె భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. జవహర్ లాల్ నెహ్రూ మొదటి సారి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి సెక్రటరీగా జీతం లేకుండా పనిచేసింది. 1964 సంవత్స రములో తండ్రి మరణం తరువాత రాజ్యసభకు ఎన్నిక అయింది. లాల్ బహదుర్ శాస్త్రి మంత్రి మండలిలో ప్రసారశాఖ మంత్రిగా పని చేసింది.ఆమె 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధాన మంత్రిగా పనిచేసింది. 1917, నవంబర్ 19 తేదీన జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూల ఏకైక సంతానంగా జన్మించింది ఇందిరాగాంధీ. తాను ఆడుకునే ప్రతీ ఆటలో బ్రిటిష్ వారిని ఎదిరింది పోరాడే ఒక దేశభక్తురాలి గానే తనను ఊహించుకుంటూ ఆడుకొనేది. 18 సంవత్సరాల వయస్సులోనే ఆమె వానర సేనను నడిపి ఉద్యమాలలో అనుభవం సంపాదించింది. ఇందిర పూణే విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణు రాలయింది. విశ్వభారతి విశ్వ విద్యాలయంలో చదివింది. ఇంగ్లండు నందలి ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం లోని సోమర్ విల్ కళాశాలలో చదివేటప్పుడు, స్వాతంత్ర్యం సంపాదించడంకోసం లండనులో స్థాపించ బడిన ఇండియాలీగ్ లో, 1930 లో చేరింది. 1936లో తల్లి కమలా నెహ్రూను కోల్పోయింది. 1938 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరింది. జర్నలిస్ట్ ఫిరోజ్ తో పరిచయము క్రమంగా పరిణ యానికి దారి తీసింది. నెహ్రూ కాశ్మీరీ బ్రాహ్మణులు కావటం, ఫిరోజ్ పూర్వీకులు పర్షియా నుండి భారత దేశానికి వలస వచ్చి స్థిరపడిన పార్సీలు కావటంతో పెళ్లి చేయటానికి ఆ సమయంలో నెహ్రూ ఒప్పుకోలేదు, ఆ తర్వాత నెహ్రూను మహాత్మా గాంధీ ఒప్పించడంతో, 1942-03-26న ఇందిరా (25), ఫిరోజ్ (29)ల పెళ్లి చేసారు.1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో జైలుకు వెళ్ళి 1943 మే 13 న విడుదలైంది. జైలులో ఉండగానే ఆమె ఒక మగ పిల్ల వాడికి తల్లి కాగా, ఆ బాలునికి రాజీవ్ అని పేరు పెట్టారు. రాజీవ్ గాంధీకి రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, వారు లక్నో వెళ్లగా, అక్కడ నేషనల్ హెరాల్డు పత్రికా సంపాదకునిగా ఫిరోజ్ గాంధీ పనిచేసిన సమయంలో సంజయ్ గాంధీ జన్మించాడు. భర్తతో కలిసి అలహాబాదులో ఉంటున్న సమయంలో విభేదాలు రావడంతో అలహాబాదును వదలి ఢిల్లీ చేరి ఆమె తండ్రితో జీవించింది. 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో జవహర్ లాల్ నెహ్రూకు పోటీగా ఫిరోజ్ గాంధీ రాయ్‌బరేలీ నియోజక వర్గంలో పోటీ చేసినప్పుడూ ఇందిర తండ్రి తరఫున ప్రచారం చేసి , ఆ ఎన్నికల్లో తండ్రిని గెలిపించింది. ఖంగుమని మోగే కంఠస్వరం, సామాన్యులలో కలసిపోయే ఆమె స్వభావం ప్రజలను ఆకర్షించేవి. 1959 ఫిబ్రవరి 2 న భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. 1960 సెప్టెంబర్ 8న ఫిరోజ్ గాంధీ మరణించాడు. 1964 మే 27న జవహర్ లాల్ నెహ్రూ మరణిం చడంతో ఇందిర జీవితంలో పెనువిషాదం ఏర్పడింది. తండ్రి మరణానంతరం ఇందిర రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికై లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కేబినెట్ హోదా కలిగిన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టింది. 1966 జనవరి 24న ఇందిర మొదటి సారిగా ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించి దేశ మొట్ట మొదటి మహిళా ప్రధానమంత్రిగా సంచలనం సృష్టించింది. నేటివరకు కూడా మరో మహిళ ఆ స్థానాన్ని చేపట్టలేని రికార్డు అది. ఇందిర 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పనిచేసింది. 1975-06-26 భారత ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 1977-03-22 ఇందిరా గాంధీ భారత ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 1977లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించి ఎన్నికలను ప్రకటించింది. అత్యవసర పరిస్థితి పరిణామం 1977 ఎన్నికలలో ఓటమి రూపంలో బయట పడింది. ఇందిర సొంత నియోజకవర్గ మైన రాయ్ బరేలీలో కూడా జనతా పార్టీకి చెందిన రాజ్ నారాయణ్ చేతిలో ఓడిపోయింది. 1977-10-03 ఇందిరా గాంధీని అరెస్టు చేశారు. ఇది జాతీయ అసంతృప్తి, దేశ వ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసి ఉప ఎన్నికలలో విజయం సాధించి లోక సభలో మళ్ళీ అడుగు పెట్టింది. 1980-01-06 ఎన్నికలలో ఇందిరా గాంధీ కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో భారీ విజయం సాధించి మరో సారి ప్రధాన మంత్రి బాధ్యతలను చేపట్టింది. ఈసారి విశేషం ....ఆమె స్వయంగా ఆంధ్ర ప్రదేశ్ లోని మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యతతో గెలుపొందింది. రాజభరణాల రద్దు, 1966లో రూపాయి మూల్య న్యూనీకరణ, 1969లో బ్యాంకుల జాతీయీ కరణ, బంగ్లా శరణాగతుల పునరావాసం లాంటి నిర్ణయాలతో పాటు దేశంలో పంటల ఉత్పత్తిని పెంచడానికి హరిత విప్లవం, పేదరిక నిర్మూలనకై గరీబీ హటావో నినాదం, 20 సూత్రాల పథకము లాంటి ప్రజాకర్షక పథకాలు చేపట్టింది. ఆమె 1984-06-05 ఇందిరా గాంధీ సిక్కు పవిత్ర స్థలమైన అమృత్సర్‌లోని స్వర్ణ దేవాలయం పై ఆపరేషన్ బ్లూ స్టార్ దాడి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే 1984-10-31 భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని ఆమె అంగరక్షకులు సత్వంత్ సింగ్, బితాంత్ సింగ్ లు న్యూ ఢిల్లీలోని ప్రధాని అధికార నివాసంలో కాల్చి హత్య చేశారు. 1984-11-03 ఇందిరా గాంధీ మృతదేహాన్ని దహనం చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

స్త్రీ, పురుషులు ఇద్దరూ సమాజంలో సమానులే

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



అంతర్జాతీయ పురుషుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 19 న అంతర్జాతీయా స్థాయిలో జరుపబడే ఉ త్సవం. ఇది ఐక్య రాజ్య సమితి ఆమోదంతో మొదటగా ట్రినిడాడ్ , టొబాగోలో 1999 లో మొదట ప్రారంభించబడి, 70కి పైగా దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు కొంటు న్నాయి.1960 ల నుండే రష్యాలో పురుషుల దినోత్సవ ప్రతిపాదన ఉంది. 60వ దశకం నుండి 90వ దశకం వరకూ అసమానత పై అనేక చర్చలు చోటు చేసుకున్నాయి. పాశ్చాత్య దేశాలలో పురుషులు, వారి హక్కులు, అవసరాలు, ఆరోగ్యం, సుఖ సంతోషాల గురించిన ఆలోచన తొంభయవ దశకంలోనే ప్రారంభమైనది. స్త్రీ ఆకాంక్షల ప్రకారం పురుషులు రెక్కలు ముక్కలు చేసు కొంటున్ననూ వారి కృషిని గుర్తించటానికి ఒక్క రోజు కూడా లేదు అని, అప్పటికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుప బడుతుండటం పితృ దినోత్సవం జరుపుబడు తున్ననూ, పురుషుల కంటూ ఒక దినోత్సవం లేకపోవటం, ఈ దినోత్సవ ఆలోచనకు దారి తీశాయి. 7 ఫిబ్రవరి 1992న ఇదే ఆలోచనను అమలులోకి తెచ్చారు. పురుషులే కాక స్త్రీలు సైతం ఒక చిన్న సమూహంగా ఏర్పడి మొట్ట మొదటి అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరిపారు. 1991-92 సమయంలో థామస్ అంతర్జాతీయ పురుషుల దినోత్సవం పై ఒక పుస్తకాన్ని కూడా రచించారు. 1994లో మాల్టాలో 7 ఫిబ్రవరిలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం తొలిసారిగా నిర్వహించ బడింది. వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటూన్న పురుషు లెవరూ విదేశాలకు వెళ్ళకుండా అక్కడి చట్టాలుండేవి. కోర్టులో కేసులు విచారణ దశలో ఉన్ననూ, భర్తను కారాగారంలోనే ఉ ంచేవారు. అతి సుదీర్ఘంగా ఈ దినోత్సవాన్ని జరుపుతూ వస్తోన్న దేశాలలో మాల్టానే మొదట నిలచింది. 2009 లో అక్కడి పురుషుల హక్కుల సంఘాలు మిగతా దేశాలోలాగానే 19 నవంబరుకు ఈ దినోత్సవాన్ని మార్చటానికి ఏకగ్రీవంగా అంగీకరించాయి. తర్వాత ట్రినిడాడ్ , టొబాగో, జమైకా, హంగేరి, కెనడా, ఇటలీ, క్యూబా,ఆస్ట్రేలియా, చైనా, హాంగ్‌కాంగ్, డెన్మార్క్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఫ్రాన్స్, పాకిస్తాన్, గ్రెనడా ఆంటిగ్వా , బార్బుడా, సెయింటి కిట్స్ , కివిస్ లలో మొదటి అంతర్జాతీయ పురుషుల దినోత్సవం జరుప బడింది. ప్రస్తుతం అధిక సంఖ్యాక దేశాలు పాటిస్తున్నాయి. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం చరిత్ర, ప్రత్యేకించి బాలురు/పురుషులు ఎదుర్కొనే సమస్యలను అధిగమిస్తూ, వారి అనుభవాలను పంచుకొంటూ, ప్రాముఖ్యతను వివరిస్తూ వస్తోన్నది. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం జరుపటం నేపథ్యంలో గల ప్రాథమిక లక్ష్యాలు..సంఘానికి, వర్గానికి, కుటుంబానికి, వైవాహిక వ్యవస్థకు, శిశు సంరక్షణకు, పర్యావరణకు పురుషులు ఒనగూర్చిన ప్రయోజ నాలను గుర్తించటం, పురుషుల సాంఘిక, భావోద్వేగ, శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యంపై దృష్టి సారించటం; సాంఘిక సేవలలో, విలువలలో, అంచనాలలో, చట్టాలలో పురుషులు ఎదుర్కొం టున్న వివక్షను చాటటం, స్త్రీ-పురుషుల మధ్యన సఖ్యత, సరైన సంబంధాలను నెలకొల్పటం; లింగ సమానత్వాన్ని వ్యాపింప జేయటం, సంఘంలో పురుషులు/బాలురు ఎదుర్కొనే వివక్షను పురుష జాతికి...సంఘం పట్ల, కుటుంబం పట్ల, వివాహం పట్ల, శిశు సంరక్షణ పట్ల గల సత్సం కల్పము, ఆయా దిశలలో పురుష జాతి సల్పే కృషి, వీటి వలన పురుష జాతికి కలిగే సాధక బాధకాలను విశదీకరించే సందర్భమే అంతర్జాతీయ పురుషుల దినోత్సవము. స్థూలంగా ఈ దినోత్సవం యొక్క విశాల , అంతిమ ధ్యేయం ప్రాథమిక మానవీయ విలువలను పెంపొందించటం. నిరాధార వరకట్న వేధింపు, గృహ హింస వ్యాజ్యాలతో పురుషుల వ్యక్తిగత, వృత్తి సంబంధిత, వైవాహిక జీవితం చిన్నాభిన్న కావటం; ఏ నేరము చేయకనే పురుషులు, వారు తోబుట్టువులు, వృద్ధ తల్లిదండ్రులు జైలుపాలు కావటం; సంఘం, వ్యవస్థ, చట్టాలు, ప్రసార మాధ్యమాలు, స్త్రీ వాదులు, స్త్రీ వాద సంస్థలు, తల్లి, ఆడ పడుచు స్థానాలలో ఉన్న స్త్రీలను విస్మరించి కేవలం భార్య స్థానంలో ఉన్న స్త్రీలను మాత్రమే స్త్రీలుగా పరిగణించటంతో ఈ వైఖరిని ఖండిస్తూ, ఈ దృక్పథంలో మార్పును ఆశిస్తూ భారతీయ స్త్రీలు సైతం అంతర్జాతీయ పురుషుల దినోత్సవంలో పాలుపంచు కోవటం ప్రారంభించారు. చట్టపరమైన తీవ్రవాదాన్ని ఆపమని, అకారణంగా బనాయించబడే 498ఏ/గృహహింస వ్యాజ్యాలకు అడ్డుకట్ట వేయమని అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా 2007 లో కలకత్తా నగరంలో భారతీయ మహిళలు ప్లేకార్డులు ప్రదర్శిస్తూ కవాతును నిర్వ హించారు. అలాగే పురుష హక్కుల సంస్థ సేవ్ ఇండియన్ ఫ్యామిలీ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరపటానికి పిలుపు నిచ్చింది. పురుషులకు కూడా సంక్షేమ శాఖ నెలకొల్పాలన్నది సంస్థ ప్రధాన డిమాండు. భారత దేశంలో పన్ను కట్టేవారిలో 82% శాతం పురుషులేనని, కానీ గడచిన 60 సంవత్సరాలలో పురుషుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా వెచ్చించ బడలేదని పేర్కొన్నారు. వివక్ష లేని గృహహింస చట్టాలు కావాలని, పురుషుల సమస్యలు పరిగణలోకి తీసుకోవాలని ఈ దినోత్సవాన్ని ఇతర పురుషుల హక్కుల సంస్థలు సమర్థించాయి. నిత్య జీవితంలో పురుషుడు ఎన్నో కష్టాలను పడుతుంటాడని అతనికి ఇది కేవలం ఒక చిన్ని కృతజ్ఞత తెలిపే సందర్భంగా సంఘాలు పేర్కొన్నాయి. తనకేం కావాలో, తనకు ఇష్టమైనదేదో, తన మనస్తత్వ మేమిటో తెలుసుకొనే లోపే పురుషుడు యాంత్రిక జీవితాన్ని అంది పుచ్చు కొంటాడని, పురుషుని త్యాగం అక్కడే మొదలవు తుందన్నాయి. స్త్రీ విమోచనకు కృషి చేసిన పురుషులను గుర్తు చేసుకొంటూ, వారు లేనిదే స్త్రీ జాతి ఈ రోజున ఇంత ముందుకు పోలేక పోయేదన్నాయి. పురుషులు కూడా మానవులేనని, ఒక స్త్రీకి ప్రేమాభి మానాలు ఎంత అవసరమో, పురుషుడికి కూడా అంతే అవసరం అని, సృష్టిలో స్త్రీ - పురుషులిరువురూ భాగస్థులేనని, పురుషులు గ్రహాంతర వాసుల నుండి రాలేదని అని వివరించాయి. ప్రస్తుత సాంఘిక దృక్పథంలో పురుషుడిని దురుసుగా ప్రవర్తించే ప్రతిబింబాలుగానే చూపటం జరుగుతోందని దీనిని మార్చ వలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ దినోత్సవాన్ని జరిపే వారి అభిప్రాయం.





రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

పారిశుద్ధ్యంపై అవగాహన అనివార్యం

నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం





ప్రతి సంవత్సరం నవంబర్ 19న జరుపుకునే ప్రపంచ టాయిలెట్ దినోత్సవం, మానవ జీవితంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సురక్షితమైన మరుగుదొడ్ల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో శుభ్రమైన పరిసరాల ప్రాముఖ్యతను జాగృతం చేయడం, ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల వారికి టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రోత్సహించడం. 2001లో, సింగపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త విరాధాన్ బెంకటేశన్ వరల్డ్ టాయిలెట్ ఆర్గనైజేషన్ను స్థాపించారు. టాయిలెట్ సమస్యలు సమాజంలో ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లుగా గుర్తించి, ఈ అంశంపై గ్లోబల్ అవగాహన పెంచే దిశగా కృషి ప్రారంభించారు. 2013లో, ఐక్యరాజ్య సమితి ఈ ప్రయత్నాన్ని గుర్తించి, ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. మురికి నీరు, శుభ్రత లేమి కారణంగా డయేరియా, మలేరియా వంటి అనేక అంటువ్యాధులు ప్రబలుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ) ప్రకారం, ప్రతి సంవత్సరం లక్షలాది మంది చిన్న పిల్లలు మరుగుదొడ్ల అసౌకర్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షిత మరుగుదొడ్ల ఏర్పాటు, పరిశుభ్రత అనుసరణతో అనేక వ్యాధుల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు. ముఖ్యంగా మహిళలు, బాలికలు మరుగుదొడ్ల కొరత కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా పాఠశాలలలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారు చదువు మధ్యలోనే మానేస్తున్నారు. సురక్షిత మరుగుదొడ్లు సమాజంలో మహిళల ఆత్మ గౌరవాన్ని పెంపొందించడమే కాక, సమాన అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన మురుగు నీటి నిర్వహణ లేకపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. భూమి మరియు నీటి కాలుష్యానికి ఇది ప్రధాన కారణం. సురక్షిత మరుగుదొడ్లతో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా 3.6 బిలియన్ మంది సరైన పారిశుద్ధ్య సదుపాయాలు లేకుండా జీవిస్తున్నారు. గ్రామీణ మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో శుభ్రమైన మరుగుదొడ్ల కొరత అత్యంత తీవ్రమైన స్థాయిలో ఉంది. పిల్లల మానసిక ఆరోగ్యం, మహిళల భద్రత మీద కూడా టాయిలెట్ సౌకర్యాల లేమి ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా టాయిలెట్ అవసరాలపై ప్రజలలో అవగాహన కల్పించడానికి పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రకారం, 2030 నాటికి ప్రపంచం లోని ప్రతి ఒక్కరికి శుభ్రమైన మరియు సురక్షితమైన మరుగుదొడ్లు అందించాలన్నది లక్ష్యం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరుగుదొడ్ల నిర్మాణంలో ముందుండి భాగస్వాములు కావాలి. ప్రతి ఒక్కరూ ఈ సమస్యపై చైతన్యవంతులై కృషి చేయవచ్చు. టాయిలెట్ ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులు, స్నేహితులతో చర్చించాలి. పాఠశాలలు, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సహాయ పడాలి. పారిశుద్ధ్యానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

కేకేఆర్ వాటా విక్రయానికి రంగం సిద్ధం



- 400 మిలియన్ డాలర్లకు భారీ డీల్!
- 22.5 శాతం వాటాను విక్రయించేందుకు జయ్ మెహతా సన్నాహాలు
- అమెరికా పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో చర్చలు

ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సహ-యజమాని జయ్ మెహతా తన 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో సుమారు 400 మిలియన్ డాలర్లకు (రూ. 3,300 కోట్లకు పైగా) ఈ భారీ నగదు ఒప్పందం జరగనుంది.

ముంబై/కోల్‌కతా, నవంబర్ 18 (చురకలు): ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. జట్టు సహ-యజమాని జయ్ మెహతా కేకేఆర్‌లో తనకున్న 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ 'ఎరెస్ మేనేజ్‌మెంట్'కు ఈ వాటాను విక్రయించనున్నారు. ఈ ఒప్పందం విలువ సుమారు 400 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 3,300 కోట్లకు పైగా) ఉంటుందని సమాచారం. ఈ డీల్ ప్రకారం కేకేఆర్ జట్టు మొత్తం విలువను 1.78 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 16,634 కోట్లు) నిర్ణయించారు. ఇటీవల రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల విక్రయాల విలువలకు అనుగుణంగానే కేకేఆర్ విలువ కూడా నమోదవడం విశేషం.

బీసీసీఐ అనుమతి తప్పనిసరి.. 5 శాతం రుసుము చెల్లింపు:

బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్ ఖాన్‌కు కేకేఆర్‌లో 55 శాతం వాటా ఉండగా, జయ్ మెహతా, ఆయన భార్య, ప్రముఖ నటి జూహీ చావ్లాకు కలిపి 45 శాతం వాటా ఉంది. వీరంతా కలిసి 2007లో ఈ జట్టును కొనుగోలు చేశారు. తాజా వాటా విక్రయ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. అయితే, ఈ వాటా బదిలీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారిక అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం, కొత్త పెట్టుబడిదారు నేపథ్యాన్ని బీసీసీఐ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అంతేకాకుండా, ఈ ఒప్పందం మొత్తం విలువలో 5 శాతం అంటే సుమారు 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 200 కోట్లు) బీసీసీఐకి రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. 2022లో సీవీసీ క్యాపిటల్ సంస్థ గుజరాత్ టైటాన్స్ జట్టును కొనుగోలు చేసినప్పటి నుంచి ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అమెరికా పెట్టుబడి సంస్థల ఆసక్తి బాగా పెరిగింది. ఆర్సీబీ జట్టులో కూడా బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్ వంటి అమెరికా సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం కేకేఆర్ వాటాను కొనుగోలు చేస్తున్న ఎరెస్ మేనేజ్‌మెంట్‌కు క్రీడా రంగంలో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ సంస్థకు ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో ప్రఖ్యాత చెల్సీ ఎఫ్‌సీ, ఎన్‌ఎఫ్‌ఎల్‌లో మయామి డాల్ఫిన్స్ జట్లలో వాటాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇంగ్లాండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లోని ట్రెంట్ రాకెట్స్ జట్టుకు కూడా సహ-యజమానిగా వ్యవహరిస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన కేకేఆర్ జట్టులో జరుగుతున్న ఈ వాటా మార్పు క్రీడా, వాణిజ్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



భారత్‌తో తొలి టెస్టు

కివీస్ కెప్టెన్ కీలక ప్రకటన!

న్యూఢిల్లీ, నవంబర్ 18 (చురకలు): భారత్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్ తమ జట్టు కూర్పుపై కీలక విషయాలు వెల్లడించాడు. తొలి టెస్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు, ఒక బౌలింగ్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగనున్నట్లు స్పష్టం చేశాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో స్థానాల గురించి ఆలోచించకుండా తమదైన శైలిలో క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారిస్తామని తెలిపాడు. తొలి టెస్టుకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో లాథమ్ మాట్లాడాడు. న్యూజిలాండ్ పేస్ దళంలో మాట్ హెన్రీ, కైల్ జేమీసన్ కీలక పాత్ర పోషించనున్నట్లు లాథమ్ వెల్లడించాడు. మూడో పేసర్ ఎవరనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లో కంకషన్‌కు గురైన హెన్రీ పూర్తిగా కోలుకున్నాడని తెలిపాడు. 'హెన్రీ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లో రాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు' అని పేర్కొన్నాడు. జేమీసన్ కూడా గత రెండు వారాలుగా తీవ్రంగా శ్రమిస్తున్నాడని, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో అతడి బౌలింగ్ ఆకట్టుకుందని ప్రశంసించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికపై స్పందించిన లాథమ్ ప్రస్తుతం తమ దృష్టంతా భారత్‌తో సిరీస్‌పైనే ఉందన్నాడు. డబ్ల్యూటీసీ ప్రస్తుత చక్రంలో ఆరు టెస్టులు ఆడి నాలుగు విజయాలతో న్యూజిలాండ్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నాడు. అయితే పట్టికలో స్థానాల కంటే మైదానంలో మెరుగైన ప్రదర్శన చేయడమే ముఖ్యమని స్పష్టం చేశాడు. 'మా నియంత్రణలో ఉన్న అంశాలపైనే దృష్టి పెడతాం. మా ఆటతీరుకు అనుగుణంగా అవకాశాలను సృష్టించుకుని విజయాలు సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని లాథమ్ వివరించాడు.

కొన్ని అధ్యాయాలు ముగియాల్సిందే..

- ధోనీ వీడ్కోలుపై సాక్షి భావోద్వేగం!
- ఐపీఎల్‌కు మహీ వీడ్కోలు పలికినట్లు వార్తలు
- కొత్త ప్రయాణానికి స్వాగతం అంటూ భార్య సాక్షి సందేశం



చెన్నై, నవంబర్ 18 (చురకలు): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికినట్లు వెలువడుతున్న వార్తలు అభిమానులను భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన భార్య సాక్షి సింగ్ ధోనీ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న సందేశం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'కొన్ని అందమైన కొత్త అధ్యాయాలు ప్రారంభం కావాలంటే కొన్ని అధ్యాయాలు ముగియాల్సి ఉంటుంది' అంటూ ఆమె చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. ఇన్నేళ్లుగా ధోనీని ప్రేమించి, ప్రోత్సహించి, అండగా నిలిచిన అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'కొత్త ప్రారంభాలు, కొత్త ప్రయాణాలు, మరెన్నో మధుర జ్ఞాపకాలకు స్వాగతం. నీ గురించి ఎంతో గర్వంగా ఉంది మహీ' అంటూ భావోద్వేగంతో పేర్కొన్నారు. సాక్షి తన సందేశంతోపాటు పచ్చని కొండలు, మంచుతో కప్పుకున్న పర్వతాల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న ధోనీ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌పై అభిమానులు పెద్దఎత్తున స్పందిస్తున్నట్లు సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా కూడా ధోనీపై గర్వాన్ని వ్యక్తం చేస్తూ స్పందించినట్లు కథనాలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యంతో జరిగిన వీడియో సమావేశంలో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు జట్టు సహ యజమాని రూప గురునాథ్ తెలిపారని కథనాలు పేర్కొంటున్నాయి. వచ్చే సీజన్ కోసం విడుదల చేసే ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో తన పేరును కూడా చేర్చాల్సి రావచ్చని ధోనీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. జట్టుకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేనని భావిస్తే ధోనీ ఆట కొనసాగించరని రూప పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2008 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రధాన ఆధారంగా నిలిచిన ధోనీ తన నాయకత్వంలో జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు అందించారు. చెన్నైని పదిసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చిన ఆయన 2020 ఆగస్టులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకుంటున్నారన్న వార్తలతో అభిమానులు ఆయన అద్భుతమైన క్రికెట్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటున్నారు.



బాల్ ట్యాంపరింగ్ అందరికీ తెలుసు..

ఆసీస్ బండారం బయటపెట్టిన బ్యాన్‌క్రాఫ్ట్!

కేప్‌టౌన్, నవంబర్ 18 (చురకలు): ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసిన 2018 కేప్‌టౌన్ బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో సాండ్‌పేపర్‌తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఆస్ట్రేలియా క్రికెటర్ కెమెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ ఎనిమిదేళ్ల తర్వాత సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం తనకు, డేవిడ్ వార్నర్‌కు మాత్రమే పరిమితం కాదని, జట్టు కోచ్‌లు, ప్రధాన బౌలర్లకు కూడా ముందే తెలుసని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించాలనే ఒత్తిడిలో భాగంగా వార్నర్ ఈ ఆలోచన చేశారని, జట్టులో కొత్తవాడినైన తనతో ఆ పని చేయించారని వెల్లడించారు. జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలనే ఉద్దేశంతో తప్పని తెలిసినా అంగీకరించానని బ్యాన్‌క్రాఫ్ట్ వివరించారు. ప్రధాన కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్‌తోపాటు పలువురు బౌలర్లకు ఈ వ్యవహారంపై అవగాహన ఉందని ఆరోపించారు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, టిమ్ పెయిన్ పేర్లను కూడా ప్రస్తావించారు. బంతి రివర్స్ స్వింగ్ అవుతున్న తీరుపై వారు తనతో మాట్లాడేవారని పేర్కొన్నారు. తన కదలికలు కెమెరాలకు చిక్కే ప్రమాదం ఉందని కోచ్ లీమన్ హెచ్చరించారని తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన తెలియాల్సి ఉంది. మైదానంలో సాండ్‌పేపర్ ఉపయోగిస్తూ కెమెరాలకు చిక్కిన తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టవద్దని జట్టు మేనేజ్‌మెంట్ ఒత్తిడి తెచ్చిందని బ్యాన్‌క్రాఫ్ట్ ఆరోపించారు. సాండ్‌పేపర్ బదులుగా టేప్, మట్టి ఉపయోగించినట్లు చెప్పాల్సి వచ్చిందన్నారు. 2021లో బౌలర్లకు ఈ వ్యవహారం తెలుసా అనే ప్రశ్నకు తాను ఇచ్చిన సమాధానం తర్వాత వారు తమకేమీ తెలియదని ప్రకటనలు చేయడం బాధించిందని పేర్కొన్నారు. శిక్ష పూర్తయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ తిరిగి జాతీయ జట్టులో అవకాశం దక్కలేదని బ్యాన్‌క్రాఫ్ట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంలో తప్పుల భారాన్ని తానొక్కడినే మోస్తున్నానని, ఉస్మాన్ ఖ్వాజా పుస్తకం విడుదలైన నేపథ్యంలో అసలు విషయాలను అభిమానులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నానని చెప్పారు. బ్యాన్‌క్రాఫ్ట్ తాజా ఆరోపణలతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో బాల్ ట్యాంపరింగ్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

ఆసీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్

- వన్డే సిరీస్ కైవసం!
- నిర్ణయాత్మక పోరులో 97 పరుగుల భారీ విజయం
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న ఇంగ్లండ్



హోబర్ట్, నవంబర్ 18 (చురకలు): ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపైనే ఓడించి చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. హోబర్ట్ వేదికగా జరిగిన చివరి, నిర్ణయాత్మక మూడో వన్డేలో ఇంగ్లండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి, ఆస్ట్రేలియాను 97 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు ఓపెనర్ బెన్ డకెట్ అద్భుతమైన శతకంతో చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో ఇంగ్లండ్ 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెన్ డకెట్ 115 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 133 పరుగులు బాది ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ 59 పరుగులు, టోమ్ బాంటన్ 44 పరుగులతో రాణించడంతో ఇంగ్లండ్ పటిష్ట స్థితికి చేరుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ నాలుగు వికెట్లు పడగొట్టగా, మాట్ రెన్షా మూడు వికెట్లు దక్కించుకున్నాడు. అనంతరం 329 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు ఆరంభం నుంచే ఒత్తిడికి లోనైంది. ఇంగ్లండ్ బౌలర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయడంతో ఆ జట్టు కేవలం 231 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ తరఫున మాట్ రెన్షా 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, అలెక్స్ కేరీ 37 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో సన్నీ బేకర్ నాలుగు వికెట్లు నేలకూల్చగా, లియామ్ డాసన్ మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ చక్కటి వ్యూహాలతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన బెన్ డకెట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



నేడు నా కల నిజమవుతోంది!

భావోద్వేగంతో యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): 'నాకు సినిమాలంటే పిచ్చి.. రేపు నా కల నిజమవుతోంది' అంటూ యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె కీలక పాత్రలో నటించిన 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' చిత్రం నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. సినిమాలో తాను పోషించిన 'కీర్తన' పాత్రపై ఉన్న ప్రేమను, సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న ఉత్సాహాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'ఇది కలేం కాదు మా.. రేపు నా కల నిజమవుతోంది. నవంబర్ 19 నుంచి మా సినిమా థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ చిత్రం మీ అందరికీ నచ్చుతుందని, నన్ను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అంటూ శివాత్మిక పేర్కొన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం కొత్త కథలతో ప్రేక్షకులను థియేటర్లలో కలుస్తూనే ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఎందుకంటే.. నాకు సినిమాలంటే పిచ్చి!' అంటూ తన పోస్ట్‌ను ముగించారు. యువతను విశేషంగా ఆకట్టుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా శివాత్మిక పోషించిన కీర్తన పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చ జరుగుతోంది. సినిమాలపై ఆమెకున్న అభిమానాన్ని ప్రతిబింబించేలా చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మరి ఈ చిత్రంతో శివాత్మిక ప్రేక్షకులను ఏ స్థాయిలో మెప్పిస్తారో చూడాలి.

ఫులేరా గ్రామానికి మళ్లీ స్వాగతం

కొత్త సీజన్‌తో 'పంచాయత్' సందడి!


డిసెంబర్ 3 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ఐదో సీజన్



హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల విశేష ఆదరణ పొందిన మోస్ట్ అవేటెడ్ కామెడీ వెబ్ సిరీస్ 'పంచాయత్' సీజన్ 5 త్వరలోనే అలరించడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 3న ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ కొత్త సీజన్ గ్రాండ్‌గా స్ట్రీమింగ్ కానుంది. ఫులేరా గ్రామ ఎన్నికల రాజకీయాలు, ఆ తర్వాత చోటుచేసుకునే ఊహించని పరిణామాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఉత్కంఠను పంచనున్నాయి. ఈ తాజా సీజన్‌లో జితేంద్ర కుమార్ (అభిషేక్), రఘుబీర్ యాదవ్ (ప్రధాన్ జీ), నీనా గుప్తా (మంజు దేవి), అశోక్ పాఠక్ తదితరులు తమ సహజ నటనతో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. గత సీజన్ ముగింపులో ఫులేరా గ్రామ రాజకీయాల్లో ఊహించని భూకంపమే సంభవించింది. దశాబ్దాలుగా గ్రామ రాజకీయాలను శాసించిన ప్రధాన్ జీ, ఆయన భార్య మంజు దేవి ఎన్నికల్లో ఊహించని ఓటమిని చవిచూశారు. వారి స్థానంలో ప్రత్యర్థి క్రాంతి దేవి గ్రామ కొత్త ప్రధాన్‌గా పగ్గాలు చేపట్టగా, ఆమె భర్త భూషణ్ అలియాస్ 'బన్‌రాకాస్' తెరవెనుక చక్రం తిప్పుతూ మరింత పవర్‌ఫుల్‌గా మారారు. కొత్త పాలకుల రాకతో గ్రామ కార్యదర్శి అభిషేక్‌కు అసలైన కష్టాలు మొదలవుతాయి. ప్రతీకార ధోరణితో వ్యవహరించే కొత్త నాయకత్వం మధ్య సచివ్ జీ అభిషేక్ పడే పాట్లు ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పూయించనున్నాయి. మరోవైపు, తన కల అయిన ఎంబీఏ పూర్తి చేయడానికి సిద్ధమవుతున్న అభిషేక్.. గ్రామంలో ఇంకా ఏయే సమస్యలకు ముగింపు పలుకుతాడు? అధికార పీఠం దక్కించుకున్న బన్‌రాకాస్ అల్లరి ఏ స్థాయిలో ఉంటుంది? అన్న ఆసక్తికర అంశాలతో ఐదవ సీజన్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగనుంది. మొదటి సీజన్ నుంచి వరుసగా నాలుగు సీజన్ల పాటు అద్భుత విజయాన్ని అందుకున్న 'పంచాయత్' సిరీస్, డిసెంబర్ 3న రాబోతున్న కొత్త సీజన్‌తో మరింత వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది.

బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో!

ముంబై, నవంబర్ 18 (చురకలు): బాలీవుడ్ అందాల తార మౌనీ రాయ్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంటున్నారు. నల్లటి దుస్తుల్లో ఆమె స్టైలిష్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అందం, అభినయంతోపాటు ఫ్యాషన్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మౌనీ రాయ్ విభిన్నమైన దుస్తులతో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తుంటారు. బుల్లితెర నుంచి వెండితెరకు ఎదిగిన మౌనీ రాయ్ తన నటనతోపాటు ఫ్యాషన్ అభిరుచితోనూ గుర్తింపు పొందారు. సంప్రదాయ దుస్తులైనా, ఆధునిక వస్త్రధారణైనా తనదైన శైలిలో కనిపించడం ఆమె ప్రత్యేకత. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ఆమె గ్లామరస్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాలు, ఫ్యాషన్ రంగాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటూ మౌనీ రాయ్ ముందుకు సాగుతున్నారు.





ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమా టైటిల్ అదేనా?

తన తాత ఎన్టీఆర్ నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ 'లవకుశ' టైటిల్ కలిసొచ్చేలా 'జైలవకుశ' సినిమా చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తూ, మళ్లీ తాత ఎన్టీఆర్ టైటిల్ కలిసొచ్చేలా మరో సినిమా చేయనున్నారట తారక్. ఆల్‌టైమ్ క్లాసిక్ 'దానవీరశూరకర్ణ' టైటిల్ కలిసొచ్చేలా.. 'దానవీరశూర' పేరుతో తారక్ సినిమా చేయనున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఆ సినిమాకే 'దానవీరశూర' టైటిల్ అనుకుంటున్నారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివున్నది.



టాలీవుడ్ నటికి సైబర్ షాక్..

4.14 లక్షలు స్వాహా!

విమాన టికెట్ల బుకింగ్ పేరుతో అనితా చౌదరికి టోకరా

హైదరాబాద్, నవంబర్ 18 (చురకలు): ప్రముఖ టాలీవుడ్ నటి అనితా చౌదరి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. అమెరికా వెళ్లేందుకు విమాన టికెట్లు బుక్ చేసుకునే ప్రయత్నంలో ఏకంగా రూ.4.14 లక్షలు పోగొట్టుకున్నారు. వాషింగ్టన్ డీసీలో నివసిస్తున్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఈ నెల 12న ఆమె ఆన్‌లైన్‌లో బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల కోసం వెతికారు. ఈ క్రమంలో ఓ ట్రావెల్స్ సంస్థ పేరుతో కనిపించిన వెబ్‌సైట్‌లోని ఫోన్ నంబర్‌ను సంప్రదించగా రాజేశ్ అనే వ్యక్తి మాట్లాడాడు. వాషింగ్టన్ డీసీకి వెళ్లి తిరిగి వచ్చేందుకు బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ.4,14,180 అవుతుందని నమ్మించాడు. టికెట్ల బుకింగ్ కోసం డెబిట్ కార్డు వివరాలు కావాలంటూ ఓ ఫారం పంపించాడు. అనంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె మొబైల్‌కు వచ్చిన ఓటీపీని కూడా అడిగి తెలుసుకున్నాడు. బుకింగ్ ప్రక్రియలో భాగంగానే ఓటీపీ అడుగుతున్నాడని భావించిన అనితా చౌదరి ఆ వివరాలను వెల్లడించారు. కొద్దిసేపటికే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4.14 లక్షలు బదిలీ అయ్యాయి. నగదు కట్ అయినట్లు సందేశం వచ్చినప్పటికీ విమాన టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ రాకపోవడంతో మోసపోయినట్లు అనితా చౌదరి గుర్తించారు. వెంటనే బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించి ఫిర్యాదు చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com